


జల వనరుల శాఖ నార్త్ కోస్ట్ ఇన్‌చార్జి సీఈగా రాంగోపాల్

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ ఇన్‌చార్జి నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్‌గా కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-1 సూపరింటెండెంట్ ఇంజనీర్ డి.రాంగోపాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ సీఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విశాఖ సర్కిల్ ఎస్ఈ శంబంగి సుగుణాకరరావుకు విజయవాడలో ఐఎస్అండ్‌డబ్ల్యూఆర్ విభాగం సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాంగోపాల్‌కు ఎనిమిది వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖపట్నంలో, ఇక్కడ ఎస్ఈగా ఉన్న సుగుణాకరరావును 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడలో అదనపు బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

సమన్వయంతో పనిచేద్దాం

విశాఖ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి

- సరైన కార్యాచరణతో ముందుకువెళ్లాలి
- అధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదేశం
- సింహాచలం దేవస్థానం పంచగ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూద్దాం
- విభిన్న ప్రతిభావంతుల కోసం 25 ఎకరాల్లో క్రీడా మైదానం
- ఇన్‌చార్జి మంత్రి దృష్టికి సమస్యలు తీసుకువెళ్లిన ప్రజా ప్రతినిధులు
- భోగాపురం విమానాశ్రయానికి సిటీ నుంచి వేగంగా చేరుకునేలా రోడ్డు అభివృద్ధి చేయాలని కోరిన జీఎంఆర్ గ్రూపు ప్రతినిధులు



కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

విశాఖ నగర ఖ్యాతిని ఇనుమడింపజేసేలా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని, సరైన కార్యాచరణతో ముందుకువెళ్లాలని అధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్థికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగర గౌరవాన్ని, ప్రతిష్టను కాపాడుకునేలా సమష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. దేశంలోనే అధిక ఆదాయ వనరులు కలిగిన నగరాల్లో విశాఖ ఒకటని, అభివృద్ధికి అన్నిరకాల అవకాశాలు ఉన్నాయన్నారు. అభివృద్ధి జరగాలని, పరిశ్రమలు రావాలన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వీలైనంత త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వివరించారు. సింహాచలం పంచ గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూద్దామన్నారు. ఉచిత ఇసుక విధానం మరింత పారదర్శకంగా అమలు చేస్తామని స్పష్టంచేశారు. ఉద్యోగాల కల్పన, సేవల విస్తరణ, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టిసారించినట్టు వెల్లడించారు. విభిన్న ప్రతిభావంతుల కోసం 25 ఎకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటుచేస్తామన్నారు. ఇందుకోసం రూ.200 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలులోకి వస్తుందన్నారు. 48 గంటల్లో ఈ పథకానికి ... మిగతా 8వ పేజీలో

కష్టపడే నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు

- నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం
- విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- 'కూటమి' పార్టీల విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- విజయసాయిరెడ్డి అక్రమాలను వెలికితీస్తాం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
- ఆర్థిక రాజధానిగా విశాఖ నగరం: ఎంపీ ఎం.శ్రీభరత్

- వార్త 10లో



డోలా బాలవీరాంజనేయస్వామిని సత్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్. చిత్రంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ తదితరులు

ఎంఎల్‌సీపీ భవనంలో ఐటీ కంపెనీలు

- పార్కింగ్ కోసం సిరిపురం జంక్షన్‌లో 11 అంతస్థుల భవనం నిర్మిస్తున్న వీఎంఆర్డీఏ
- అందులో మూడు అంతస్థులు తమకు కేటాయించాలని కోరుతున్న సంస్థలు
- సుముఖంగా ఉన్న అధికారులు
- రెండు, మూడు వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం



వీఎంఆర్డీఏలోని ఎంఎల్‌సీపీ భవనం


(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) మల్టీ లెవల్ కారు పార్కింగ్ (ఎంఎల్‌సీపీ) కోసం సిరిపురం జంక్షన్‌లో నిర్మిస్తున్న భవనంలో కొంత మేర ఐటీ కంపెనీలకు ఇవ్వాలని భావిస్తోంది. ఇంకో నెల రోజుల్లో ఈ భవనం ప్రారంభానికి సిద్ధం కానున్నది.

సిరిపురం జంక్షన్‌లో ముఖ్యంగా చిల్డ్రన్ ఎరీనా, గురజాడ కళాక్షేత్రం, ఏయూ అంబేడ్కర్ భవన్‌లో ఏమైనా కార్యక్రమాలు నిర్వహించినప్పుడు వాహనాలకు పార్కింగ్ సమస్య ఎదురవుతోంది. దీనిని పరిష్కరించడానికి ఉద్యోగ భవన్ ముందున్న 1.72 ఎకరాల స్థలంలో ఎంఎల్‌సీపీ భవనం నిర్మాణాన్ని వీఎంఆర్డీఏ చేపట్టింది. ముందు రూ.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. సాంకేతిక కారణాలు, కాంట్రాక్టర్ చేసిన జాప్యం కారణంగా నిర్మాణం ఆలస్యమైంది. బడ్జెట్ రూ.87.5 కోట్లకు చేరింది. కమిషనర్‌గా విశ్వనాథన్ వచ్చిన తరువాత ఎప్పటికప్పుడు స్పష్టమైన లక్ష్యాలు ఇస్తూ త్వరితగతిన భవనం పూర్తి చేయడానికి యత్నిస్తున్నారు. ప్రస్తుతం దీనికి అవసరమైన పవర్ బ్యాకప్ కోసం జనరేటర్లను కూడా తెప్పించారు. ఇంకో నెల రోజుల్లో భవనం సిద్ధమయ్యే అవకాశం ఉంది.

ఐదు అంతస్థుల్లో కారు పార్కింగ్

ఇది 11 అంతస్థుల భవనం. కింద గ్రౌండ్‌లో మూడు అంతస్థులు, ఆ పైన మరో రెండు అంతస్థులు పార్కింగ్‌కు కేటాయించినట్టు కమిషనర్ విశ్వనాథన్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వీటిలో 430 కార్లు, 400 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్‌ను మాత్రం వాణిజ్య అవసరాలకు కేటాయించనున్నారు. ఆపైన ఉన్న అంతస్థులను ఐటీ కోసం ఇవ్వాలని భావిస్తున్నారు. సుమారు 1.6 లక్షల చ.అ. స్థలం అందుబాటులో ఉంది. నగరం నడిబొడ్డున, అదీ ఎదురుగా సముద్రం కనిపించేలా, పార్కింగ్‌కు కూడా తగినంత స్థలం అందుబాటులో ఉండడంతో దీనిని తమకు కేటాయించాలని ఐటీ సంస్థలు కోరుతున్నాయి. ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) పూర్వ అధ్యక్షులు శ్రీధర్ కొసరాజు దీనిపై కమిషనర్‌ను సంప్రతించగా ఐటీ సంస్థలైన డబ్ల్యుఎన్ఎస్, పాత్ర, క్లౌడ్ ఎరా, డిజిటల్ మార్కెటింగ్‌ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మొత్తం ఆరు అంతస్థులలో 1.6 లక్షల చ.అ. స్థలం అందుబాటులో ... మిగతా 8వ పేజీలో



లేజర్ షో ప్రదర్శించనున్న విక్టరీ ఎట్ సీ

తీరంలో లేజర్ షో

- విక్టరీ ఎట్ సీపై ప్రతి ఆదివారం మెరుపులు

వెంకోజీపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా తీరంలో ప్రతి ఆదివారం రాత్రి ఏడు గంటల నుంచి సౌండ్ అండ్ లేజర్ షో నిర్వహించేందుకు జీవీఎంసీ రంగం సిద్ధం చేసింది. బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ సమీపంలో గల విక్టరీ ఎట్ సీ వద్ద ఈనెల 27 నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది. గత నెల రెండో తేదీన నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 1971లో జరిగిన నౌకాదళ యుద్ధం, విశాఖ నగరం పాత్ర, యుద్ధవీరుల సాహసాలతో పాటు దేశ చరిత్రను వివరిస్తూ లేజర్ షో సాగుతుందని జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సూచనల మేరకు లేజర్‌షోను ప్రజలంతా ఉచితంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

ఉక్కుకు విద్యుత్ చిక్కు

- బకాయిలు రూ.124.21 కోట్లు
- రేపటిలోగా రూ.44 కోట్లు చెల్లించకుంటే సరఫరా కట్ చేస్తామని ఈపీడీసీఎల్ నోటీస్
- మరోవైపు ఉద్యోగులకు సెప్టెంబరు నెల జీతాలు ఇంకా పూర్తిగా చెల్లించని యాజమాన్యం



విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఉక్కు కర్మాగారం నిధులు సర్దుబాటు చేసుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఉద్యోగులకు సెప్టెంబరు నెలకు సంబంధించిన జీతాలు ఇంకా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. సగం మాత్రమే ఇచ్చింది. ఈ నెల 31న దీపావళి. పండుగ నాటికి తమకు మిగిలిన జీతాలు ఇవ్వకపోతే ఆందోళనకు దిగుతామని కార్మిక సంఘాలు హెచ్చరిక జారీచేశాయి. ఇదే సమయంలో ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ తమ బకాయిలు ఈ నెల 27వ తేదీలోగా చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నోటీసు ఇచ్చింది. స్టీల్‌ప్లాంటుకు వృథా వాయువులతో నడిచే 435 మెగావాట్ల క్యాప్టివ్ పవర్ ప్లాంటు ఉంది. అయితే ప్రస్తుతం మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకు బదులుగా ఒక్కటే అరకొరగా నడవడం వల్ల సరిపడా వృథా వాయువులు అందక పవర్ ప్లాంటు ఆగిపోయింది. దాంతో ఏపీఈపీడీసీఎల్ నుంచి అవసరమైన విద్యుత్ తీసుకుంటోంది. ఆగస్టు నెల విద్యుత్ బిల్లు రూ.70.46 కోట్లు వచ్చింది. దానిని చెల్లించడానికి సెప్టెంబరు 15వ తేదీ వరకు గడువు ఉంది. ఆ తరువాత సెప్టెంబరు నెల బిల్లు రూ.79.75 కోట్లు వచ్చింది. దీనికి అక్టోబరు 15వ తేదీ వరకు గడువు ఉంది. స్టీల్‌ప్లాంటు ఆర్థిక ఇబ్బందుల వల్ల బిల్లు చెల్లించకపోవడంతో ఈపీడీసీఎల్ అధికారులు ప్లాంటుకు వెళ్లి తమ పరిస్థితి కూడా బాగా లేదని, ఎంతో కొంత ... మిగతా 8వ పేజీలో

సచివాలయ వ్యవస్థను గాడిలో పెడతాం



మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనం

- మిగులు సిబ్బందిని ఇతర శాఖలకు సర్దుబాటు చేస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థను గాడిలో పెట్టి సిబ్బంది నుంచి మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని సాంఘిక, సీనియర్ సిటిజన్ సంక్షేమం, సచివాలయం, విలేజ్ వలంటీర్ శాఖల మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. 'చడీచప్పుడు లేదు!... స్తబ్దుగా సచివాలయాలు' శీర్షికతో శుక్రవారం విశాఖపట్నం 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్‌లో ప్రచురించిన కథనంపై మంత్రి స్పందించారు. ఇక్కడి సర్క్యూట్‌హౌస్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ గ్రామ/వార్డు సచివాలయాల నిర్వహణ, సిబ్బంది సర్దుబాటుపై ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో కూడిన కమిటీ నియమించిందన్నారు. చాలాచోట్ల సచివాలయాల్లో అవసరానికి మించి సిబ్బంది ఉన్నారని, కొన్ని పంచాయతీల్లో రెండు నుంచి మూడు సచివాలయాలు ఉన్నాయని, అటువంటిచోట్ల కొన్నింటిని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా ... మిగతా 8వ పేజీలో

ఏయూలో డ్యూయల్ డిగ్రీలు

- బీటెక్‌లో వీఎల్ఎస్ఐ, ఎంటెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సులు
- సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో మార్పులు
- వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు



ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సు లను ప్రారంభిస్తున్నట్టు వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు వెల్లడించారు. శుక్రవారం నిర్వహించిన వార్షిక బోర్డు ఆఫ్ స్టడీస్ సమా వేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా ... మిగతా 8వ పేజీలో

దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు



- 29వ తేదీ నుంచి బుకింగ్‌కు అవకాశం
- బియ్యం కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలంటున్న అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

దీపావళి (ఈనెల 31వ తేదీ) నుంచి రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభం కానున్నది. ఇందుకు సంబంధించి ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటల నుంచి గ్యాస్ బుకింగ్‌కు అవకాశం ఇవ్వనున్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు అందజేయనున్నారు. ఉచిత సిలిండర్లు పొందాలంటే ఆధార్ కార్డు, బియ్యం కార్డు కలిగి ఉండాలి. జిల్లాలో 5.29 లక్షల బియ్యం కార్డుదారులు, గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారుల వివరాలు పౌర సరఫరాల శాఖ, గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉన్నాయి. ఈనెల 29వ తేదీన సిలిండర్ బుక్ చేసుకోగానే పౌర సరఫరాల శాఖకు సమాచారం అందుతుంది. సాధారణంగా సిలిండర్ బుక్ చేసుకున్న 24 గంటల నుంచి ... మిగతా 8వ పేజీలో



జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న క్వారీ

క్వారీ తవ్వకాలతో స్థానికుల భయాందోళన

ఆనందపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం - పెందుర్తి జాతీయ రహదారికి 50 మీటర్ల దూరంలో జరుగుతున్న క్వారీ తవ్వకాల వల్ల జగనన్న కాలనీకి ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గండిగుండం జాతీయ రహదారికి ఆనుకుని రామవరం రోడ్డులో క్వారీ తవ్వకాలకు అధికారులు అనుమతి ఇచ్చారు. క్వారీ పక్కనే జగన్న కాలనీ ఉంది. ఇక్కడ 45 మందికి ఇళ్లు మంజూరు చేయగా లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసి, నివాసం ఉంటున్నారు. క్వారీ తవ్వకాల బ్లాస్టింగ్స్ వల్ల వారంతా భయభ్రాంతులకు గురవుతున్నారు. అంతేకాకుండా జాతీయ రహదారికి 50 మీటర్ల దూరంలో తవ్వకాలు జరుగుతుండడంతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలకు కూడా ప్రమాదం పొంచి ఉంది. నిబంధనలు ప్రకారం హైవేకి కనీసం 500 మీటర్ల దూరంలో క్వారీ తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలి. కానీ కేవలం 50 మీటర్లలోపే అనుమతులు ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



సాయిని అభినందిస్తున్న అధ్యాపకులు

కొమ్మాది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేశ్ అన్నారు. కళాశాలలో సీఎస్ఈ ఆఖరి సంవత్సరం చదువుతున్న మేడిశెట్టి చైతన్య సాయి ఈనెల 23న విజయనగరంలోని ఎంవీజీఆర్‌లో జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల తైక్వాండో పోటీల్లో (54 కిలోల విభాగం) ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చైతన్యసాయి వచ్చే నెల 6, 7, 8, 9 తేదీల్లో పంజాబ్‌లోని గురునానక్ దేవ్ వర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫైనాన్స్ డైరెక్టర్ మాధవి, సీఎస్ఈ విభాగాధిపతి పవన్ సతీశ్, పిడి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ కళాశాలలో..

తగరపువలస : సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల విద్యార్థులు వచ్చే నెల 12 నుంచి 15 వరకు అమృతసర్‌లోని గురునానక్‌దేవ్ వర్సిటీలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి సంగివలస ఎన్ఆర్ఐ డెంటల్ కళాశాలలో ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వి. ప్రియ, నేహ, తదితరులు ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

భీమునిపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తమ సంస్థ ఉచితంగా అందిస్తున్న కంప్యూటర్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి కోరారు. శుక్రవారం ఆ సంస్థ కార్యాలయంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను ప్రారంభించారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

పద్మనాభం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ కె. ఆనందరావు చెప్పారు. శుక్రవారం ఆయన కృష్ణాపురంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. భూములను గుర్తించే విధంగా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా అక్రమంగా పట్టాలు పొందినట్లైతే వారిపై చర్యలు తీకుంటామని చెప్పారు.

సురక్షిత నగరంగా విశాఖ

- నగర సీపీ శంఖబ్రత బాగ్చీ
- ఐటీ హబ్‌లో పోలీసు అవుట్ పోస్టు ప్రారంభం



ఉడా కాలనీ రోడ్డును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

సాగర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉన్న మొదటి పది సురక్షిత నగరాల్లో విశాఖను ఒకటిగా చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. ఐటీ హబ్ కూడలిలో పీఎంపాలెం పోలీసుల ఆధ్వర్యంలో పెన్నెంట్ ఐటీ సంస్థ సౌజన్యంతో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీసు అవుట్ పోస్టును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీ పరిశ్రమల్లో పగలు, రాత్రి విధులు నిర్వహించే ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవుట్ పోస్టులో పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఐటీ హిల్స్ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ఎప్పటికప్పుడు పోలీసుల పహరా ఉంటుందన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో తీవ్రతను గుర్తించి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేరాల సంఖ్యను తగ్గించడంలో పోలీసులకు ప్రజా సహకారం అవసరమని తెలిపారు. నగర పరిధిలో నిర్మానుష్య ప్రదేశాలు విజుబుల్ వుండే విధంగా చర్యలు తీసుకుంటే గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటివి నిలువరించడానికి అవకాశం ఉంటుందన్నారు. కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతులు రావడం వల్ల ఎస్ఐల సంఖ్య తక్కువగా ఉందని చెప్పారు. అవుట్ పోస్టు ఏర్పాటుకు ఆర్థికంగా సహకరించిన పెన్నెంట్ ఐటీ సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 అజిత వేజెండ్ల, జోన్-2 జెడ్సీ సింహాచలం, నార్త్ జోన్ ఏసీపీ ఎస్. అప్పలరాజు, పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ఎండాడ : పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైం రేట్ తగ్గించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు సీపీ ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. శుక్రవారం ఆయన ట్రాఫిక్ అధికారులతో కలిసి కార్ షెడ్ కూడలి, డీమార్ట్ కూడలి, సర్వీసు రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్ బోర్డులు వినియోగించాలన్నారు. మిథిలాపురి ఉడా కాలనీ ప్రాంతంలో స్టాపర్ బోర్డులతో డివైడర్ మాదిరిగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలానే డీమార్ట్ ప్రాంతంలో వాహనాల పార్కింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తే విధంగా ఆక్రమణలు ఉంటే తొలగించాలని చెప్పారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న సమయాల్లో అదనంగా కానిస్టేబుళ్లను కేటాయించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యపై సీపీకి తరచూ ఫిర్యాదులు రావడంతో ఆయన స్వయంగా వచ్చి పరిశీలించారు.

అభివృద్ధికి నోచుకోని మధురవాడ మార్కెట్

- కనీస సదుపాయాలు కరువు
- ప్రతిపాదనల దశలో నిలిచిన నూతన భవన నిర్మాణం



కనీస సదుపాయాలు లేని డైలీ మార్కెట్

మధురవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మధురవాడలో రోజు వారీ మార్కెట్ ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవడం లేదు. జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఈ మార్కెట్‌పై సుమారు 20 మంది వ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. మధురవాడ పరిసరాల్లో 20 గ్రామాల ప్రజలకు గతంలో ఇదొక్కటే బజారు. ఇక్కడ చికెన్, మటన్‌తో పాటు చేపలు, కూరగాయలు విక్రయిస్తుంటారు. వ్యాపారులు జీవీఎంసీ పాటదారుడికి ఆశీలు చేస్తున్నారు. కానీ జీవీఎంసీ మాత్రం ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. పదేళ్ల కిందట మార్కెట్‌లో ఇంగ్లీషు అక్షరం యూ ఆకారంలో మూడు అంతస్తుల భవనం నిర్మించాలని ప్రతిపాదించినా..అది ఆచరణ సాధ్యం కాలేదు.ప్లాన్ ప్రకారం సెల్లార్‌లో వాహనాల పార్కింగ్, మొదటి ఫ్లోర్‌లో కూరగాయలు విక్రయాలకు స్టాల్స్, రెండవ అంతస్తులో చేపలు, మాంసం విక్రయాలకు దుకాణాలు కేటాయించాలని జీవీఎంసీ ప్రణాళిక. కానీ ఇది అమలు కాలేదు. దీనికి ముందు డైలీ మార్కెట్‌లో ఎంతమంది వ్యాపారులు ఉన్నారన్నది సర్వే చేసి ఒక జాబితా కూడా రూపొందించారు. ఆ జాబితాలో ఉన్న వారికి మాత్రమే కొత్త మార్కెట్ సముదాయంలో దుకాణాలు నామమాత్రపు అద్దెకు కేటాయించాలని భావించారు. కానీ ఈ ప్రణాళిక సగంలో నిలిచిపోవడంతో వ్యాపారులకు, వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏమాత్రం వర్షం పడినా మార్కెట్ చిత్తడిగా మారుతుంది. దుకాణాలన్నీ కారిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆలయ పునర్నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి



ఆలయ గోపురం పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

పద్మనాభం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అనంత పద్మనాభుని ఆలయ పునర్నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్. సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఆలయ గోపురం పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురాతనమైన ఆలయాలను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆలయ వైశిష్ట్యాన్ని తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలని ఈఓ నానాజీబాబుకు సూచించారు. అనంతరం క్షేత్ర ఆవిర్భావ విశేషాలను అర్చకుడు సీతారామాంజనేయస్వామి ద్వారా అడిగి తెలుసుకున్నారు. దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ జీవీఆర్ శేఖర్, కాంట్రాక్టర్లను ఆలయ గోపుర నిర్మాణం ఎప్పటిలోగా పూర్తి చేస్తారని కమిషనర్ అడగ్గా, వచ్చే నెల 20 నాటికి పూర్తి చేస్తామని వారు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువులోగా నిర్మాణం పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ, ఈఈ దుర్గేశ్‌కుమార్, డీఈఈ కేవీసీ కృష్ణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేశ్‌కుమార్, బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు హంస మహేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు సన్యాసిరావు, పైడిరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పంచ గ్రామాల భూ సమస్యపై వినతి

సింహాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.శుక్రవారం వారు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయన్ను కలిశారు. సమస్య తీవ్రతను వివరించి, పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి టిపి కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు బి. శంకరరావు, హనుమంతరావు, బలరాము, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భైరవస్వామి ఆలయ రోడ్డు పరిశీలన

సింహాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయం భైరవస్వామి ఆలయానికి పక్కా రోడ్డు నిర్మాణానికి ఉన్న అడ్డంకులపై అటవీ, దేవాదాయ శాఖాధికారులు శుక్రవారం క్షేత్ర పరిశీలన చేశారు. జిల్లా అటవీ శాఖాధికారి వెంకటేశ్, రేంజర్ శాస్త్రితో పాటు దేవస్థానం డీఈఈ రామరాజు కాలినడకన ఆలయానికి చేరుకుని రోడ్డు నిర్మాణంపై చర్చించారు. దేవస్థానం ప్రతిపాదించిన రోడ్డు పొడవు, వెడల్పు తదితర అంశాలను కొలిచి తీసుకోవాల్సిన చర్యలపై ఇరు శాఖల అధికారులు పూర్తిస్థాయిలో చర్చించారు. నివేదికను ప్రభుత్వానికి పంపుతామని డీఎఫ్ఓ తెలిపారు.

దేవదాయ శాఖ స్థలంలో అక్రమ నిర్మాణాలు

భీమునిపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో దేవదాయ శాఖకు చెందిన లంగరుఖానా సత్రం భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. మూడో వార్డులో ఉన్న కొంకివీధిలో ప్రస్తుతం రెండు షెడ్లు నిర్మిస్తున్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఈ భూములు చాలాకాలంగా పలువురి ఆక్రమణలో ఉన్నాయి. వారు ఆ శాఖకు శిస్తు చెల్లిస్తున్నారు. అయితే నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. కొంకివీధిలో వున్న భూముల్లో ఏడు నెలల క్రితం నిర్మాణాలు ప్రారంభించగా అప్పట్లో సత్రం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తర్వాత నిర్మాణదారులు కోర్టును ఆశ్రయించడంతో ఈ కేసు పెండింగ్‌లో వుంది. శుక్రవారం నుంచి మళ్లీ నిర్మాణాలను ప్రారంభించారు. ఈ విషయమై లంగరు ఖానా సత్రం ఈఓ రాజగోపాలరెడ్డి వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి : సీఐ

పద్మనాభం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా మందుగుండు సామగ్రి అమ్మకానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాణసంచా సామగ్రి అమ్మేవారు ముందుగా షాపు ఏర్పాటు చేసే స్థల యజమాని నుంచి అనుమతి తీసుకోవడంతో పాటు పంచాయతీ నుంచి క్లీరెన్స్ సర్టిఫికెట్, అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి పొందాలన్నారు. అలాగే స్థానిక పోలీసుల అనుమతి కూడా తీసుకోవాలని చెప్పారు. అనుమతి లేకుండా విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

200 మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేఖవానిపాలెంలో అవంతి ఫార్మసీ కళాశాల వైద్యులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 200 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎంటీవీ రాజు ప్రారంభించగా వైస్ ప్రిన్సిపాల్ ఉమా శంకర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త రుషి, సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

సాగర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇండో పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక సమీకరణాలు భద్రత అంశాలపై గీతం వర్సిటీలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సదస్సును గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ (న్యూఢిల్లీ) సెంటర్ ఫర్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్, తైవాన్‌కు చెందిన ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా తైవాన్ దేశానికి చెందిన ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ అధికారి ప్రతినిధి రాబర్ట్ హిష్ మాట్లాడుతూ తైవాన్ చిన్న దేశం అయినప్పటికీ విద్య, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో ప్రపంచంలోనే అగ్ర స్థానంలో ఉందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో తైవాన్ పాత్రను తగ్గించడానికి చైనా ఉద్దేశ పూర్వకంగానే సమస్యలు సృష్టిస్తోందని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ (న్యూఢిల్లీ) వీసీ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ మాట్లాడుతూ తైవాన్‌తో భారత్ సంబంధాలు భవిష్యత్తులో మరింతగా మెరుగుపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గీతం అర్థశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మందర్ వి. కులకర్ణి, నేషనల్ మేరీటైమ్ ఫౌండేషన్ నిపుణురాలు కె. దీప, సెంటర్ ఫర్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ అల్కా ఆచార్య, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. సుష్మరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రారంభం

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ప్రారంభించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యేలు/ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధిష్ఠానం ఆదేశించింది. రూ.100 సభ్యత్వంతో కార్యకర్తలకు రూ. ఐదు లక్షల ప్రమాద బీమా వర్తించనున్నది. భీమిలి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తారు. ఎంవీపీకాలనీలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయంలో 10గంటలకు సీనియర్ కార్యకర్తకు సభ్యత్వం అందిస్తారు. ఉత్తర పరిధి బర్మాక్యాంపు ఏఎస్ఆర్ నగర్‌లో ఎంపీ శ్రీభరత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, గోపాలపట్నంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, గాజువాక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా, సబ్బవరం జీఎస్ కల్యాణ మండపంలో ఇన్‌చార్జి గండి బాబ్జీ, జాలారిపేటలో దక్షిణ ఇన్‌చార్జి సుధాకర్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సభ్యత్వం తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వివరించారు.

దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు

... 7వ పేజీ తరువాయి

48 గంటల్లో డెలివరీ ఇస్తుంటారు. గ్రామీణ ప్రాంతంలో మరో రోజు ఆలస్యమవుతుంది. ఇంటికి సిలిండర్ వచ్చిన 48 గంటలలోపు వినియోగదారుని బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. నాలుగు నెలలకు ఒకసారి ఉచిత సిలిండర్ పొందవచ్చు. ఇందుకు సంబంధించి విధి విధానాలు ఇంకా పౌర సరఫరాల శాఖ అధికారులకు అందాల్సి ఉంది. ప్రస్తుతం విశాఖ నగరంలో సిలిండర్‌కు కంపెనీలు రూ.811 తీసుకుంటున్నాయి.

సచివాలయ వ్యవస్థను గాడిలో పెడతాం

... 7వ పేజీ తరువాయి

పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో వర్క్ లోడ్ మేరకు సిబ్బందిని కొనసాగించి, మిగిలిన వారిని ఇతర శాఖలకు సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పలు ఇంజనీరింగ్ శాఖలకు బదలాయించి వారి సేవలు వినియోగించుకుంటామన్నారు. మంత్రుల కమిటీ అధ్యయనం తరువాత సచివాలయాల రూపురేఖలు మార్చుతామని మంత్రి అన్నారు.

ఉక్కుకు విద్యుత్ చిక్కు

... 7వ పేజీ తరువాయి

చెల్లించకపోతే సరఫరా చేయడం కష్టమని చెప్పడంతో ఆగస్టు బిల్లుకు సంబంధించి ఇటీవల రూ.26 కోట్లు చెల్లించారు. ఆగస్టు నెలకు సంబంధించి మిగిలిన రూ.44.46 కోట్లు, సెప్టెంబరు బిల్లు రూ.79.75 కోట్లు కలిపి మొత్తం రూ.124.21 కోట్లు ఇంకా చెల్లించాల్సి ఉంది. అక్టోబరు 27వ తేదీకి బిల్లు కట్టకపోతే సరఫరా నిలిపివేస్తామని విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ గురువారం నోటీసు జారీ చేశారు. దీనిపై యాజమాన్యం మల్లగుల్లాలు పడుతోంది. అటు ఉద్యోగుల జీతాలకు సర్దుబాటు ఎలా?, ఇటు విద్యుత్ బిల్లులకు నిధులు ఎక్కడి నుంచి తేవాలి?...అనే దానిపై యోచన చేస్తోంది.



ఆయుధాల పనితీరుపై వివరిస్తున్న అధికారులు

పోలీస్ బెటాలియన్‌లో ఆయుధాల ప్రదర్శన

కొమ్మాది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలకమని ఆర్‌డీఓ సంగీత్ మాధుర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో ఆయుధాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ఎందరో పోలీసులు ప్రాణాలు అర్పించారని, వారిని ఏటా స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని చెప్పారు. అనంతరం బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలు విద్యా సంస్థల నుంచి హాజరైన విద్యార్థులకు ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి. సత్యం, ఆర్ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సాగర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) :ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా పెరగడంతో వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో పడుతోందని, దీనివల్ల ఆర్థిక నేరాలు కూడా పెరుగుతున్నాయని ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో సైబర్ సెక్యూరిటీ నిపుణురాలుగా పనిచేస్తున్న మౌతన్ సర్కార్ అన్నారు. గీతం వర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై జరిగిన అవగాహన సదస్సులో శుక్రవారం ఆమె మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలు జరిగే విధానం, వ్యక్తిగత సమాచారం భద్రత వంటి అంశాలను వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రజలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ విభాగం అధిపతి డాక్టర్ జి. లక్ష్మీశ్వరి, డాక్టర్ గురుప్రీత్‌సింగ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

మధురవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలకు దూరంగా ఉండొచ్చని పినాకిల్ ఆస్పత్రి క్లినికల్ న్యూట్రిషన్ ఫరీదా సుల్తానా చెప్పారు. మధురవాడ శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్) ఎన్ఎస్ఎస్ యూనిట్ నోడల్ ఆఫీసర్ జి. సుధాకర్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమన్నారు. ఎత్తు, బరువు, వయసుకు సరిపడ సమతుల్య ఆహారం తీసుకొని, చక్కని ఆరోగ్య అలవాట్లతో పాటు వ్యాయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. ఈ కార్య క్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి. సాయి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

... 7వ పేజీ తరువాయి

సంబంధించి డబ్బులు జమ అవుతాయన్నారు. సీఎస్ఆర్ నిధులతో కేజీహెచ్‌లో ఓపీ బ్లాక్ అభివృద్ధి చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు.

మంత్రి దృష్టికి సమస్యలు

జిల్లాలో వివిధ సమస్యలను పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పరిపాలనాపరమైన అంశాల్లో అధికారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే అధికారులకు అండగా ఉంటామన్నారు. ఉత్సాహంగా ఉండే ఉద్యోగులకు ప్రోత్సాహం, డల్‌గా ఉండే ఉద్యోగులకు పనిష్మెంట్ ఉంటాయన్నారు. రుషికొండ సమీపంలో కొత్తగా వేసిన రోడ్డును ప్రారంభించాలని మంత్రిని కోరారు. దీనివల్ల పర్యాటకం పెరుగుతుందన్నారు. గాజువాక ప్రాంతంలో కన్వెన్షన్ డీడీ, 22ఏ భూముల విషయంలో సడలింపులు ఇవ్వాల్సి ఉందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గంగవరం పోర్టు నిర్వాసితులకు పరిహారం, ఉద్యోగాల కల్పన గురించి ప్రస్తావించారు. అలాగే జెట్టీ నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. పొల్యూషన్ బోర్డు మెంబర్ సెక్రటరీ విశాఖలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, అందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. నేవల్ డాక్‌యార్డు వద్ద ప్రత్యామ్నాయ మార్గాన్ని కల్పించాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కోరారు. పంచ గ్రామాల సమస్యను కొలిక్కి తీసుకురావాలని కోరారు. డెత్ సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులను పరిష్కరించాలని, నివాసాల మధ్యలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలను తొలగించాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రస్తావించారు. నగరంలో హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుచేయాలని, అందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కోరారు. మత్స్యకారులకు ఇళ్లు ఇవ్వాలన్నారు. ప్రజా ప్రతినిధులు సిఫారసులను పరిగణనలోకి తీసుకునేలా, అధికారులు త్వరితగతిన స్పందించేలా చూడాలంటూ ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. మంచి ప్రభుత్వం అనే నినాదాన్ని పాటిస్తూ ప్రజలకు సత్వరమే సేవలు అందించేలా చూడాలన్నారు.

వేగంగా విమానాశ్రయానికి చేరుకునేలా రోడ్లు వేయాలి

సమావేశానికి హాజరైన జీఎంఆర్ గ్రూపు ప్రతినిధులు కీలక అంశాలను ప్రస్తావించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ప్రతినిధులు..విశాఖ సిటీ నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వేగంగా చేరుకునేలా రోడ్లు అభివృద్ధి చేయాలని కోరారు. లంకెలపాలెం నుంచి తగరపువలస వరకు 12 ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ఆయా చోట్ల ఫ్లై ఓవర్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇప్పుడున్న జాతీయ రహదారి 16, రాష్ట్ర రహదారులను విస్తరించాలని సూచించారు. నాగపూర్‌లో మాదిరిగా డబుల్ డెక్కర్ మోడల్‌లో రోడ్లు వేయాలని, బీచ్ రోడ్లను అనుసంధానం చేయాలని సూచించారు. దీనిపై స్థానిక ఎంపీ భరత్ స్పందిస్తూ..ప్రస్తుత జాతీయ రహదారిని విస్తరించాలంటే మెట్రో ప్రాజెక్ట్ కారిడార్ కొలిక్కి రావాలని, అప్పుడే సమాంతరంగా పనులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. బీచ్ రోడ్డును అనుసంధానం చేస్తే వాహనాల వేగం పెరుగుతుందని, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. అంతకుముందు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జిల్లాలో చేపట్టబోయే ప్రాజెక్టులు గురించి, స్థితిగతులు గురంచి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాన్నామని చెప్పారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రజెంటేషన్ ఇస్తూ జిల్లాలో శాంతి, భద్రతల పరిరక్షణకు వినూత్న చర్యలు చేపడుతున్నామని, దీనిలో భాగంగా గస్తీ పెంచామన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాస్టర్ ప్లాన్‌పై పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్ పాల్గొన్నారు.

ఎంఎల్‌సీపీ భవనంలో ఐటీ కంపెనీలు

... 7వ పేజీ తరువాయి

ఉందని, ఐటీ కంపెనీలకు ఇవ్వడానికి సుముఖంగా ఉన్నామని కమిషనర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చే ఐటీ పాలసీలో ఉపాధి అవకాశాలు కల్పించే ఐటీ సంస్థలకు భవనం అద్దెలో 50 శాతం రాయితీ ఇవ్వాలని వీఎంఆర్డీఏ యోచిస్తోంది. గతంలోను తెలుగుదేశం ప్రభుత్వం ఐటీకి ఇలాంటి రాయితీలు ఇచ్చింది. ఇప్పుడు దానిని పునరుద్ధరించే అవకాశం ఉండడంతో ఆ స్కీమ్‌లో ఇక్కడ కనీసం రెండు వేల నుంచి మూడు వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఏయూలో డ్యూయల్ డిగ్రీలు

... 7వ పేజీ తరువాయి

డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రతి పాదిస్తున్నామన్నారు. బీటెక్‌లో వీఎల్ఎస్ఐ, ఎంటెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. అలాగే అనివార్య కారణాల వల్ల మిడ్, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాని, పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం (2018 తరువాత విద్యార్థులకు మాత్రమే) రీ ఎగ్జామి నేషన్స్ నిర్వహించాలని నిర్ణయించినట్టు వీసీ తెలిపారు. సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. అనంతరం విభాగాల్లో బీఓఎస్ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ధనుంజయరావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎ.నరసింహ రావు, జి.గిరిజాశంకర్, కె.సీతామాణిక్యం, ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ, ప్రొఫెసర్ డి.నాగరాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

శారదా పీఠం భూములు వెనక్కి తీసుకోవడంపై హర్షం

ఆరిలోవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లాలో శారదాపీఠానికి రూ.225 కోట్ల విలువైన భూమిని కేటాయిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలపడంపై భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరాంమూర్తి జె.రవి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి భూమి కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు.

ఖైదీలతో ములాఖత్‌కు పెద్ద సంఖ్యలో క్యూ



లెటర్స్ కోసం క్యూలో నిల్చొన్న దృశ్యం

ఆరిలోవ, అక్టోబరు 25 : (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో ఉంటున్న ఖైదీలను చూసేందుకు శుక్రవారం వారి బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ములాఖత్ అనుమతి పత్రాల కోసం వారంతా క్యూ కట్టారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో పాటు పొలం పనులు ఉండడంతో రాలేకపోయామని వారంతా చెప్పారు. ములాఖత్‌కు 100 మందికి పైగా వచ్చారు. వీరు సాయంత్రం 4వ గంటల వరకు శిక్ష అనుభవిస్తున్న తమ వారిని చూసే అవకాశం లభించింది. రిమాండ్ ఖైదీని వారి బంధువులు చూడడానికి వారానికి రెండుసార్లు అవకాశం ఉండగా, శిక్ష పడిన ఖైదీకి 15 రోజులకు రెండుసార్లు కలిసే అవకాశం కల్పిస్తారు.

రోడ్లపై గుంతల పూడ్చివేత



ఆరిలోవ, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి) : హనుమంతువాక జంక్షన్ నుంచి చినగదిలి వరకు గల సర్వీసు రోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డులో గోతుల పూడ్చివేతను జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుండడంతో రోడ్లపై ఉన్న గోతులను తారు, కంకర వేసి పూడ్చివేశారు. ప్రస్తుతానికి పెదగదిలి ప్రాంతంలో ఈ ప్యాచ్ వర్క్‌లు చేపడుతున్నారు.

సినిమా గైడ్

● వీనమ్ : మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం),శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● పొట్టేల్ : వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● ఎంతపనిచేసావ్ చంటి : వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● లగ్గం : విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)

● దేవర :జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● వేట్టయాన్ : సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)

● విశ్వం : శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● జనక అయితే గనక : శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 42, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 44, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 44, బీరకాయలు 30, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 28, క్యారేట్ 54 దొండకాయలు 34, బంగాళదుంపలు 31, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 68, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 125, పొటల్స్ 52, కీరదోస 30, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 28, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఇదేనా 'ఆదర్శ'నగర్!



అధ్వానంగా ఉన్న వీధి రోడ్లు

» వెలగని వీధి దీపాలు

» అధ్వానంగా రహదారులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 17వ వార్డు పరిధిలోని ఆదర్శనగర్‌లో కనీస వసతులు కరువవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 'పేరులోనే 'ఆదర్శం' తప్ప, ఇక్కడ అన్నీ సమస్యలే. ఎన్నోసార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేడంటూ స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా.. ఈ ప్రాంతంలో అధిక శాతం వీధి లైట్లు చాలా రోజుల నుంచి వెలగడం లేదు. చీకటి పడితే అంధకారం నెలకొనడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద కూడా ఉంది. దీంతో రాత్రి వేళల్లో చీకట్లో కుక్కలు వెంబడిస్తుంటాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకట్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి మరీ కరుస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. వీధి కుక్కల భయంతో వాహనాలను వేగంగా పోనిచ్చే క్రమంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్న సంఘటనలు కోకొల్లలు.



వీధి దీపాలు వెలగక అంధకారంలో వీధులు

అధ్వానంగా రోడ్లు

మరో పక్క వీధి రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉన్నవే చిన్నపాటి వెడల్పు ఉన్న వీధులు. అందులో భూగర్భ డ్రైనేజీ కోసం సీసీ రోడ్లు తవ్వి ఏళ్లు గడిచిపోయినా, కనీసం ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదు. అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని ఇటు కన్నెత్తి చూడటం లేదంటూ ఈ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరిలో కనీస అవగాహన కొరవడి, చిన్నపాటి వీధుల్లోనే తమ వస్తువులను రహదారిపై ఉంచుతున్నారు. దీనివల్ల వీధుల్లో నుంచి ప్రయాణం చేసేవారికి ఇబ్బందిగా ఉంది. పలుసార్లు ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, స్పందన లేదని సామాజిక కార్యకర్త గొనప అప్పన్న పేర్కొన్నారు.

పశుగణన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పశుగణన పథకానికి సంబంధించిన గోడ పత్రికను స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా 21వ అఖిల భారత పశుగణన మన రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్టు తెలిపారు. ఇంటికి వచ్చే సంబంధిత అధికారగణానికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. డిసెంబరు 31 వరకూ ఈ గణన జరుగుతుందని పశుసంవర్థక శాఖ డెప్యూటీ డైరక్టర్ ఎం చంద్రశేఖర్, సహాయ డైరక్టర్ ఎస్ శ్రీనివాస్, వైద్యులు వై పూర్ణిమ, సాయికళ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అధ్యాపకులకు ప్రినిపాల్స్‌గా పదోన్నతి



చంద్రమౌళి రేఖ డేవిడ్‌రాజ్

మద్దిలపాలెం, అక్టోబరు 25 : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు అధ్యాపకులు ప్రిన్సిపాల్స్ పదోన్నతులు పొందారు. సీనియర్ అధ్యాపకులు బి.చంద్రమౌళి, కె.రేఖ, టి.శామ్యూల్ డేవిడ్‌రాజ్‌లకు పదోన్నతలు కల్పించి బదిలీ చేశారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చంద్రమౌళి, విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రేఖ, పోరుమామిళ్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శామ్యూల్‌ను నియమించారు. పదోన్నతులు పొందిన అధ్యాపకులను కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు అభినందించారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరి అరెస్టు

ఆరిలోవ అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) : జోడుగుళ్లపాలెం బీచ్ సమీపంలో ఇద్దరు యువలను చాకు చూపించి బెదిరించి డబ్బు తీసుకెళ్లిన ఇద్దరు యువకులను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం సుమారు 4:30 సమయంలో కండ్రెడి లిఖిత్, అతడి స్నేహితుడు కలసి రుషికొండ వైపు నుంచి బీచ్‌రోడ్డు మీదుగా జోడుగుళ్లపాలెం వచ్చి తమ ద్విచక్ర వాహనంపై వచ్చి పాన్‌షాపు వద్ద నిలబడి ఉండగా, గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి సిగరెట్ అడిగారు. తమకు సిగరెట్ తాగే అలవాటు లేదని చెప్పడంతో అక్కడకు వచ్చిన వారిలో ఒక వ్యక్తి.. ఓ యువకుడి ప్యాంటు జేబులో చేయి పెట్టి డబ్బులు తీయబోయాడు. దీంతో ఆ యువకుడు నిలువరించగా వెంటనే చాకు తీసి బెదిరించాడు. ఓ యువకుడి జేబులో ఉన్న రూ.500 తీసుకొని పరార య్యారు. దీనిపై బాధిత యువకులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్ సీఐ డి.బంగారుపాప, ఆరిలోవ క్రైం ఎస్‌ఐ హరికృష్ణ, కేసు దర్యాప్తు చేపట్టి నిందితులు ఆరిలోవ ప్రాంతానికి చెందిన బండారురాజు, కొండూరు కిరణ్‌లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసులను సీపీ బాగ్చి అభినందించారు.

కూటమి పాలనలో ధరాఘాతం : సీపీఐ



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

ఆరిలోవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో ప్రజలు ఆర్థిక భారంతో కుండిపోతున్నారని, వెంటనే ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆరిలోవ సీపీఐ నేతలు, కార్యకర్తలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆరిలోవ, ఏఎస్ఆర్ నగర్, లక్ష్మీనగర్, సాయినగర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి షేక్ రెహమాన్, అత్తిలి విమల మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. పెరిగిన ధరలను తట్టుకోవడం ప్రజల వల్ల కావడం లేదన్నారు. మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పి గత ప్రభుత్వం విక్రయించిన ధరలకే విక్రయిస్తున్నారని విమర్శించారు. ఆదాయం పెంచుకోవడం కోసం గుడులు, బడులు, నిషేధిత ప్రాంతాల్లో కూడా మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు దేవుడమ్మ, ఆరిలోవ ఏరియా కార్యదర్శి కె.లక్ష్మణరావు, సహాయ కార్యదర్శి కాసుబాబు, ప్రజానాట్య మండలి సభ్యులు చిరంజీవి, ఎ.రవి, పి.పుష్ప, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : సీపీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంకబ్రత బాగ్చి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా పెను సవాల్‌గా మారిన సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి సూచించారు. 'సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ' అంశంపై ఎంవీపీ కాలనీలోని ఐఐఎం బిజినెస్ స్కూలులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ డిజిటల్ స్పేస్‌లో పెరుగుతున్న ముప్పులు, సవాళ్లను ఎదుర్కోవడానికి సన్నద్ధం కావడం, సైబర్ నేరాలు వంటి అంశాలపై ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. నేరాల వివిధ రూపాలు, వ్యక్తులు, వ్యాపారాలు, వాటి వల్ల కలిగే నష్టాలు, బెదిరింపులు వంటి విషయాల్లో రక్షించుకోవడానికి అవసరమైన వ్యూహాలు వివరించారు. విద్యార్థి దశ నుంచే సైబర్ సెక్యూరిటీ పరిజ్ఞానంపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవడం అవసరమని పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ ఎస్పీ రవీంద్ర, జాయింట్ డైరక్టర్ పీఎం బాలాజీ, ప్రొఫెసర్ భవానీ, ప్రొఫసర్ రమ్య పాల్గొన్నారు.

మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు

» బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం



ఆరిలోవ, అక్టోబరు 25 : (ఆంధ్రజ్యోతి) : తాను మరణించి మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి జి.జగదీష్ అని రాష్ట్ర జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు అన్నారు. శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన జి.జగదీశ్ (41) ఈ నెల 22న ఇంట్లో ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, తలలో తీవ్రంగా రక్తస్రావం జరుగుతున్నట్టు అక్కడి వైద్యులు తెలిపారు. మూడు రోజులు వైద్యులు శ్రమించినా ఫలితం దక్కలేదు. శుక్రవారం బ్రెయిన్‌డెడ్ అయినట్టు కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. అవయవ దానంపై అవగాహన కల్పించడంతో అందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబ దృష్టికి తెచ్చారు. ఆయన వెంటనే తగిన చర్యలు తీసుకొని జగదీశ్ శరీరం నుంచి కిడ్నీలు, ఊపిరితిత్తులు జీవనధాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియార్టీ ప్రాతిపదికగా మరో ముగ్గురికి కేటయించారు. తాను చనిపోతూ మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపేలా చేసిన జగదీశ్, అందుకు అంగీకరించిన ఆయన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

చదువును నిర్లక్ష్యం చేయవద్దు

పైడా విద్యాసంస్థల అధినేత కృష్ణప్రసాద్



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కృష్ణప్రసాద్

సిరిపురం, అక్టోబరు 25 : చదువు ఎలాంటి విద్యార్థి అయినా ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడుతుందని, అందుకు చదువును నిర్లక్ష్యం చేయవద్దని పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పైడా డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళ, క్రీడా రంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. ఏ పరిస్థితుల్లో కూడా క్రమశిక్షణ, నిజాయితీని వీడరాదన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సరోజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులు మేధో చర్చలకు వేదికలుగా నిలవాలి : ఏయూ వీసీ



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ శశిభూషణరావు, వేదికపై శ్రీధర్ తదితరులు

వెంకోజీపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సదస్సులు మేధో చర్చలకు వేదికలుగా నిలవాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. శుక్రవారం ఏయూ జియో ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల 'జియో స్పేషియల్ టెక్నాలజీస్ ఆన్ రిజర్వాయిర్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ చాలెంజెస్' జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమకాలిన అంశంపై సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ సంపూర్ణ సమయాన్ని జ్ఞానాన్ని పొందడానికి వెచ్చించాలన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం వాటర్ రిసోర్సెస్ డిపార్టుమెంట్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ వి.శ్రీధర్, ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమేటిక్స్ (ఐఎస్‌జీ) విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ ఆచార్య కె.నాగేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను పునరుద్ధరించండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న విదసం నాయకులు

సిరిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం రద్దు చేసిన 20 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, మూత పడిన ఎస్సీ కార్పొరేషన్‌ను తెరిపించి రుణాలు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి విశాఖ దళిత సంఘం (విదసం) ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగర పర్యటనలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీరాంజనేయస్వామిని సిరిపురం సర్క్యూట్‌హౌస్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విదసం రాష్ట్ర కన్వీనర్ బి.వెంకటరావు శారదాపీఠం భూములు వెనక్కి తీసుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అన్యాక్రాంతమైన ఎస్సీల అసైన్డ్ భూములు స్వాధీనానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములు కొనుగోలులో జరిగిన అక్రమాలు సరిదిద్దాలని మంత్రిని కోరినట్టు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఈ.సుజాత, ఓంకార్, ఎ.సంతోష్, యు.రాజు, సంతోష్, వై.సంతోష్, ఎం.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి బాల వీరాంజనేయస్వామి

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖపై సర్క్యూట్‌హౌస్‌లో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీ సుకోవాలన్నారు. భోజనం మెనూ అమలుచేయకుంటే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పెండింగ్ డైట్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీల విడుదలకు హామీ ఇచ్చారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె.రామారావు, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో భూ కబ్జాలు, విధ్వంసాలు

గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు విశాఖపట్నంలో భూకబ్జాలు, విధ్వంసాలకు పాల్పడ్డారని మంత్రి డోలా ఆరోపించారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. నగరంలో మత్తు పదార్థాలు, గంజాయి వ్యాప్తి చెందించారని ధ్వజమెత్తారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందిన నగరంగా విశాఖ నిలుస్తుందన్నారు. తొందరలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తిచేస్తామన్నారు. పంచగ్రామాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. త్వరలో లబ్ధిదారులకు హుద్‌హుద్, టిడ్కో ఇళ్లు అందజేస్తామని మంత్రి తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

మహిళకు రోబోటిక్ అబ్డామినల్ సెర్కేజ్ శస్త్రచికిత్స



మహిళతో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

వెంకోజీపాలెం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే తొలిసారిగా బలహీనమైన గర్భాశయం ఉన్న మహిళకు రోబోటిక్ అబ్డామినల్ సెర్కేజ్ శస్త్ర చికిత్సను విజయవంతంగా మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కిరణ్మయి గొట్టాపు చేశారు. కొత్త వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన శస్త్రచికిత్స వివరాలను వైద్యులు పేర్కొన్నారు. విశాఖ పరిసర ప్రాంతానికి చెందిన 34 ఏళ్ల మహిళకు గతంలో ఆరుసార్లు అబార్షన్లు, రెటినోపతితో బాధపడుతున్న ప్రీమెచ్యూరిటీ ప్రసవం జరిగిందని, ఇవన్నీ కూడా రెండుసార్లు విఫలమైన యోని ఎన్సెర్కేజ్‌తో జరిగిందని డాక్టర్ కిరణ్మయి గొట్టాపు తెలిపారు. రోగికి గర్భాశయ లోపం ఉందని, ఇది గతంలో అనేక గర్భధారణ నష్టాలకు దారితీసిందన్నారు. సమస్యను పరిష్కరించడానికి ఇన్వాసివ్ రోబోటిక్ సహాయక అబ్డామినల్ సెర్కేజ్‌ను ఉపయోగించి శస్త్ర చికిత్సను నిర్వహించి, ఆరోగ్యకరమైన బిడ్డకు మహిళ జన్మనించిందన్నారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హాని లేకుండా హాయిగా దీపావళి జరుపుకుందాం

గ్రీన్ క్లైమేట్ టీం, సిఫా సంస్థ ప్రతినిధుల పిలుపు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదవాల్తేరు, అక్టోబరు 25 : పశుపక్ష్యాదులకు ఎలాంటి హాని లేకుండా సంప్రదాయబద్ధంగా దీపావళి పండుగ జరుపుకుందామాని గ్రీన్ క్లైమేట్ టీం, సిఫా సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కేడీపీఎం ఉన్నత పాఠశాల, ఏయూ తెలుగు మీడియం పాఠశాలలో గ్రీన్ క్లైమేట్ టీం, సిఫా సంస్థలు పర్యావరణం హిత దీపావళి గురించి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాణసంచా కాల్చి శబ్ద, వాయు, జల కాలుష్యం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు రమాదేవి, గ్రీన్ క్లైమెట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి రత్నం, సిఫా సంస్థ ప్రతినిధులు హేమ, నర్సింగ్ ప్రసాద్, ఆంధ్రా యూనివర్శిటీ సోషల్ వర్క్ విద్యార్థినులు, బి.ఉషారాణి, బి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం



జగదాంబ కూడలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. కనకమహాలక్ష్మిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఆలయ అధికారులు ఉచిత ప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు.

స్నేహపూర్వక సేవలు



వన్‌టౌన్ సీఐ దేముడు బాబు

జగదాంబకూడలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేముడుబాబు తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో స్నేహపూర్వక సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక శక్తుల ఆగడాలకు అవకాశంలేకుండా నిరంతర పర్యవేక్షణ చేపడతామన్నారు. అల్లూరి జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధుల్లో ఉన్న సీఐ భాస్కరరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

క్షేమ కాళీ పూజలకు పందిరి రాట



రాట వేస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీ గణేష్ వర్తక సేవా సంఘం ఆధ్వర్యంలో క్షేమ కాళీ పూజా మహోత్సవాలను ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4 వరకూ రైల్వేన్యూకాలనీ జంక్షన్‌లో నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా నిర్వాహకులు శుక్రవారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో దాడి శ్రీనివాసరావు, దువ్వి కాశీప్రసాద్, బ్రహ్మజీ, రాపేటి శ్రీను పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సుల దరఖాస్తులకు నేడే తుది గడువు

కంచరపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న సాయంకాలం డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు శనివారంతో ముగియనుంది. ప్రొఫెషనల్స్ డిప్లొమా కోర్సులకు సాంకేతిక విద్యా శాఖ ఈ నెల 21న నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సుల నిర్వహణ బాధ్యతను కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలకు అప్పగించింది. వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న అభ్యర్థుల నుంచి ఇప్పటికే అధిక సంఖ్యలో దరఖాస్తులు అందాయి. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలతో అభ్యర్థులు దరఖాస్తులు అందజేస్తున్నారు. ఇంటర్ ఎంపీసీ/బైపీసీ/ఐపీసీతో పాటు పదోతరగతి అనంతరం రెండేళ్ల వ్యవధి గల ఐటీఐ కోర్సులు పూర్తిచేసి వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న వారికి ఈ కోర్సులను సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కోర్సుల్లో చేరి శిక్షణ పొందిన వారు ఉద్యోగులైతే పదోన్నతి, విద్యార్హతలు పెంచుకోవచ్చు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పొందడానికి అర్హులవుతారు.

విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు శశిప్రియాంక

కంచరపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆర్పీపేట హెల్త్ సెంటర్ డాక్టరు శశిప్రియాంక హాజరై చిన్నారులకు ఆర్‌బీఎస్‌కె స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. పాఠశాల విద్యార్థులందరికీ పరీక్షలు చేపట్టి వారిలో ముగ్గురిని ఆయా విభాగాల ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా డా.శశి ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలుంటే వారిని లేతవయసులోనే గుర్తించి తగిన వైద్యం అందిస్తామన్నారు. స్క్రీనింగ్ పరీక్షల్లో భాగంగా వినికిడి, దృష్టిలోపం, ఆర్థో సమస్యలు, రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి వైద్య సహాయం, మందులు పంపిణీ చేస్తామన్నారు. పాఠశాల హెచ్‌ఎం మేరీ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్ నుంచి డాబాగార్డెన్ వైపు వచ్చే మార్గంలో దుకాణాలు



ఎల్‌ఐసీ దారిలో రోడ్డుకు ఆనుకుని వ్యాపారాలు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

- డాబాగార్డెన్స్ టూ ఎల్‌ఐసీ కూడలి వరకు
- పాదచారుల నడకకు చోటే లేదు

డాబాగార్డెన్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ నుంచి ఎల్‌ఐసీకి వెళ్లే దారిలో పాదచారులు నడిచివెళ్దామంటే రోడ్డు శరణ్యంగా మారుతోంది. నిత్యం పెద్ద సంఖ్యలో డాబాగార్డెన్స్ నుంచి ఎల్‌ఐసీ ప్రాంతానికి వేర్వేరు పనులపై వస్తుంటారు. అనేక వాణిజ్య దుకాణాలు, విద్యాసంస్థలు, ఇతరత్రా కార్యాలయాలు ఇక్కడుంటాయి. అయితే రోడ్డు మధ్య నుంచి పాదచారులు నడవాల్సిన పరిస్థితి వచ్చిందంటే ఎంతగా ఇక్కడ ఫుట్‌పాత్‌లను ఆక్రమించేశారో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా డాబాగార్డెన్స్ బస్టాప్ , స్వీట్‌ఇండియా, యూనియన్ బ్యాంకు, సెంట్రల్ పాయింట్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, కొద్దిగా ముందుకెళితే...పోస్టాఫీస్.. ఇలా... దేనినీ వదలకుండా ఆక్రమించేయడంతో ఫుట్‌పాత్ కానరావడం లేదు. దీంతో సాయంత్రం వేళల్లో పాదచారులు నడవాలంటే హడలిపోతున్నారు. కొంత సేపు సేద తీరుదామంటే కుదరడం లేదని వాపోతున్నారు. కొందరైతే ఏకంగా కార్లను ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేస్తున్నారు. మరికొందరు తమ వ్యాపార అవసరాలకు ఏకంగా ఫుట్‌పాత్‌ను వాడేస్తున్నారు. అసలే రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇలా ఫుట్‌పాత్‌లను ఆక్రమించేస్తే ఎలా? అంటూ పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబందింత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లను ఆక్రమణలు లేకుండా చూడాలని, కనీసం నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఆలోచింపజేసే చిత్రం...ఎంత పని చేశావ్ చంటి’



విజయోత్సవంలో పాల్గొన్న చిత్ర యూనిట్ సభ్యులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అందరినీ ఆలోచింపజేసే చిత్రమే 'ఎంత పని చేశావ్ చంటి' అని చిత్ర కథానాయకుడు శ్రీనివాస్, దర్శకుడు ఉదయకుమార్, కథానాయికలు నిహారిక, శాంతిప్రియ అన్నారు. శుక్రవారం చిత్ర విజయోత్సవంలో భాగంగా డాబాగార్డెన్స్ వెంకటేశ్వర థియేటర్‌లో చిత్ర యూనిట్ సభ్యులు సందడి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలి రోజే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. కుటుంబంలో జరిగే సంఘటనల ఆధారంగా ఉన్న సినిమా కావడంతో ప్రేక్షకుల మన్ననలు పొందిందన్నారు. వివాహమైన వ్యక్తిలో అంతర్గతంగా ఉండే లక్షణాలు చంటి పాత్రలో చూపించామన్నారు. ఐదు కుటుంబాల మధ్య జరిగిన సంఘటనలు ఈ సినిమాలో ఉన్నాయన్నారు.

బాక్సింగ్‌లో క్రీడాకారులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ లక్ష్మీనరస, పీడీ సునంద్

అక్కయ్యపాలెం, అక్టోబరు 25 (అక్కయ్యపాలెం) : హర్యానాలో జరిగిన ఆర్‌ఈసీ బాక్సింగ్ టాలెంట్ హంట్ స్పోర్ట్స్ మీట్‌లో ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి. నిహారికకు బంగారు పతకం, కె.గ్రీష్మితకు కాంస్య పతకం లభించింది. ఈ మేరకు వీరిని పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీనరస, పీడీ సునంద్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. రానున్న రోజుల్లో మరింతగా రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

కోయంబత్తూర్‌కు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా కోయంబత్తూరు, బరౌని మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 06055 నంబరు గల రైలు ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకు ప్రతి శనివారం ఉదయం 11.50 గంటలకు కోయంబత్తూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06056 నంబరు గల రైలు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 19 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరి గురువారం ఉదయం 3.48 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుతుంది. ఆరు థర్డ్ ఏసీ, ఎనిమిది స్లీపర్, జనరల్ సెకెండ్ క్లాసు, సెకెండ్ క్లాసు , దివ్యాంగుల కోచ్‌లు ఉంటాయన్నారు.

నేడు పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ కారణంగా శనివారం పలు రైళ్లను రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045), హౌరా-తిరుపతి హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (20889), షాలిమార్-తిరునెల్వేలి ప్రత్యేక రైలు (06088), హౌరా-బెంగళూరు దురంతో ఎక్స్‌ప్రెస్ (12245)లు రద్దు చేశామని పేర్కొన్నారు.

కేజీహెచ్ క్యాజువాలిటీ అభివృద్ధికి రూ.కోటి



పోర్టు యాజమాన్య ప్రతినిధుల నుంచి చెక్కు అందుకుంటున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ అవుట్ పేషెంట్ క్యాజువాలిటీ విభాగంలో సౌకర్యాల కల్పనకు విశాఖ పోర్టు యాజమాన్యం రూ. కోటి అందజేసింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ ఇందుకు సంబంధించిన చెక్కును కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు అందజేశారు. కేజీహెచ్‌లో ఓపీ క్యాజువాలిటీ విభాగాలు ఏర్పాటు చేసి సుమారు వందేళ్లు కావటంతో, ఎప్పటికప్పుడు అవసరాలను సమకూరుస్తున్నా అత్యంత దయనీయ స్థితిలోనే ఉంటున్నాయి. దీనితో సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ వీటి అభివృద్ధి ఆవశ్యకతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఈ విషయంపై విశాఖపట్నం పోర్టు యాజమాన్యంతో చర్చించారు. స్పందించిన పోర్టు యాజమాన్యం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.కోటి సమకూర్చేందుకు అంగీకరించి, శుక్రవారం చెక్కును కలెక్టర్‌కు అందజేసింది. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు,

రోలర్ స్కేటింగ్‌లో మోక్షితకు స్వర్ణ పతకాలు



విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్‌లో చిన్నారి కె.మోక్షిత అద్భుతంగా రాణించి రెండు స్వర్ణ పతకాలు సాధించింది. వుడా పార్కు రింక్‌లో శుక్రవారం జరిగిన ఈ టోర్నీ బాలికల ఆరు సంవత్సరాల వయసు విభాగంలో మోక్షిత పతకాలు సాధించి త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా కోచ్ కృష్ణకుమార్, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు మోక్షితను అభినందించారు.

‘స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి’



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో సంభాషిస్తున్న రహేజా గ్రూపు ప్రతినిధులు

సీతమ్మధార, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇనార్బిట్‌మాల్ రహేజా గ్రూప్ ఉన్నత యాజమాన్య ప్రతినిధులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఇనార్బిటల్ మాల్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. విశాఖపట్నంలో ఇతర ప్రదేశాల్లో కూడా రహేజా గ్రూప్ సంస్థలు మరిన్ని పెట్టుబడులు పెట్టి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాదనకు ఆ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.

వేతన సవరణకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా వేతన, పెన్షన్ సవరణలు చేపట్టకుండా తమ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులతో తప్పించుకుంటున్నాయని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ శుక్రవారం డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పుడు విధానాల కారణంగానే బీఎస్ఎన్ఎల్ నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. దీనికి ఉద్యోగులను బాధ్యులను చేయడం దారుణమన్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్యనిధి, ఈఎస్‌ఐ సామాజిక భద్రతకు యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పీఈసీ హెచ్‌డీ సాగర్, సీఐటీయూ కుమార్‌మంగళం, పీఎస్‌యూ లచ్చిరాజు, బీఎస్ఎన్ఎల్ నాయకులు రామాంజనేయులు, ఏఐబీడీపీఏ మూర్తి, సీసీడబ్ల్యూఎఫ్ లక్ష్మీనారాయణ, గోవిందరావు, శ్యామల, చక్రి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ప్రారంభించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యేలు/ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధిష్ఠానం ఆదేశించింది. రూ.100 సభ్యత్వంతో కార్యకర్తలకు రూ. ఐదు లక్షల ప్రమాద బీమా వర్తించనున్నది. భీమిలి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తారు. ఎంవీపీ కాలనీలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయంలో 10గంటలకు సీనియర్ కార్యకర్తకు సభ్యత్వం అందిస్తారు. ఉత్తర పరిధి బర్మాక్యాంపు ఏఎస్ఆర్ నగర్‌లో ఎంపీ శ్రీభరత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, గోపాలపట్నంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, గాజువాక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా, సబ్బవరం జీఎస్ కల్యాణ మండపంలో ఇన్‌చార్జి గండి బాబ్జీ, జాలారిపేటలో దక్షిణ ఇన్‌చార్జి సుధాకర్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సభ్యత్వం తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వివరించారు.

రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని విజయనగరం, రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ శుక్రవారం పర్యటించి భద్రతా తనిఖీలు చేపట్టారు. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద భద్రతా ఆడిట్ నిర్వహించి, ఈ మార్గంలో జరుగుతున్న మూడో లైను నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అక్కడ నుంచి కూనేరు, రాయగడ స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, యార్డు కార్యకలాపాల పనులను తనిఖీ చేశారు. ప్రయాణికులకు లభిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, సివిల్ ఇంజనీరింగ్, సిగ్నల్ అండ్ టెలికాం, మెకానికల్, ఎలక్ట్రికల్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, కమర్షియల్, ఆపరేషన్స్ అధికారులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజారులో దుకాణాల కేటాయింపు

సీతమ్మధార, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్‌లో రైతులకు దుకాణాలు కేటాయించారు. లాటరీ ద్వారా దక్కిన దుకాణంలో మాత్రమే అమ్ముకునే విధంగా పారదర్శకంగా కేటాయించినట్లు బజార్ ఎస్టేట్ అధికారి కొండ బాబు తెలిపారు. బజార్‌లో శుక్రవారం రైతులకు డ్రా నిర్వహించారు. దీని ద్వారా వచ్చిన దుకాణాల్లోనే అమ్మకాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



ఇన్‌చార్జ్ మంత్రి వీరాంజనేయస్వామిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ..

డాబాగార్డెన్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని అభ్యర్థించారు.

దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు

... 7వ పేజీ తరువాయి

48 గంటల్లో డెలివరీ ఇస్తుంటారు. గ్రామీణ ప్రాంతంలో మరో రోజు ఆలస్యమవుతుంది. ఇంటికి సిలిండర్ వచ్చిన 48 గంటలలోపు వినియోగదారుని బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. నాలుగు నెలలకు ఒకసారి ఉచిత సిలిండర్ పొందవచ్చు. ఇందుకు సంబంధించి విధి విధానాలు ఇంకా పౌర సరఫరాల శాఖ అధికారులకు అందాల్సి ఉంది. ప్రస్తుతం విశాఖ నగరంలో సిలిండర్‌కు కంపెనీలు రూ.811 తీసుకుంటున్నాయి.

సమన్వయంతో పనిచేద్దాం

... 7వ పేజీ తరువాయి

సంబంధించి డబ్బులు జమ అవుతాయన్నారు. సీఎస్ఆర్ నిధులతో కేజీహెచ్‌లో ఓపీ బ్లాక్ అభివృద్ధి చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు.

మంత్రి దృష్టికి సమస్యలు

జిల్లాలో వివిధ సమస్యలను పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పరిపాలనాపరమైన అంశాల్లో అధికారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే అధికారులకు అండగా ఉంటామన్నారు. ఉత్సాహంగా ఉండే ఉద్యోగులకు ప్రోత్సాహం, డల్‌గా ఉండే ఉద్యోగులకు పనిష్మంట్ ఉంటాయన్నారు. రుషికొండ సమీపంలో కొత్తగా వేసిన రోడ్డును ప్రారంభించాలని మంత్రిని కోరారు. దీనివల్ల పర్యాటకం పెరుగుతుందన్నారు. గాజువాక ప్రాంతంలో కన్వెన్షన్ డీడీ, 22ఏ భూముల విషయంలో సడలింపులు ఇవ్వాల్సి ఉందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గంగవరం పోర్టు నిర్వాసితులకు పరిహారం, ఉద్యోగాల కల్పన గురించి ప్రస్తావించారు. అలాగే జెట్టీ నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. పొల్యూషన్ బోర్డు మెంబర్ సెక్రటరీ విశాఖలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, అందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. నేవల్ డాక్‌యార్డు వద్ద ప్రత్యామ్నాయ మార్గాన్ని కల్పించాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కోరారు. పంచ గ్రామాల సమస్యను కొలిక్కి తీసుకురావాలని కోరారు. డెత్ సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులను పరిష్కరించాలని, నివాసాల మధ్యలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలను తొలగించాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రస్తావించారు. నగరంలో హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుచేయాలని, అందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కోరారు. మత్స్యకారులకు ఇళ్లు ఇవ్వాలన్నారు. ప్రజా ప్రతినిధులు సిఫారసులను పరిగణనలోకి తీసుకునేలా, అధికారులు త్వరితగతిన స్పందించేలా చూడాలంటూ ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. మంచి ప్రభుత్వం అనే నినాదాన్ని పాటిస్తూ ప్రజలకు సత్వరమే సేవలు అందించేలా చూడాలన్నారు.

వేగంగా విమానాశ్రయానికి చేరుకునేలా రోడ్లు వేయాలి

సమావేశానికి హాజరైన జీఎంఆర్ గ్రూపు ప్రతినిధులు కీలక అంశాలను ప్రస్తావించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ప్రతినిధులు..విశాఖ సిటీ నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వేగంగా చేరుకునేలా రోడ్లు అభివృద్ధి చేయాలని కోరారు. లంకెలపాలెం నుంచి తగరపువలస వరకు 12 ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ఆయా చోట్ల పై ఓవర్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇప్పుడున్న జాతీయ రహదారి 16, రాష్ట్ర రహదారులను విస్తరించాలని సూచించారు. నాగపూర్‌లో మాదిరిగా డబుల్ డెక్కర్ మోడల్‌లో రోడ్లు వేయాలని, బీచ్ రోడ్డను అనుసంధానం చేయాలని సూచించారు. దీనిపై స్థానిక ఎంపీ భరత్ స్పందిస్తూ..ప్రస్తుత జాతీయ రహదారిని విస్తరించాలంటే మెట్రో ప్రాజెక్ట్ కారిడార్ కొలిక్కి రావాలని, అప్పుడే సమాంతరంగా పనులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. బీచ్ రోడ్డును అనుసంధానం చేస్తే వాహనాల వేగం పెరుగుతుందని, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జిల్లాలో చేపట్టబోయే ప్రాజెక్టులు గురించి, స్థితిగతులు గురంచి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రజెంటేషన్ ఇస్తూ జిల్లాలో శాంతి, భద్రతల పరిరక్షణకు వినూత్న చర్యలు చేపడుతున్నామని, దీనిలో భాగంగా గస్తీ పెంచామన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాస్టర్ ప్లాన్‌పై పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుకు విద్యుత్ చిక్కు

...7వ పేజీ తరువాయి

చెల్లించకపోతే సరఫరా చేయడం కష్టమని చెప్పడంతో ఆగస్టు బిల్లుకు సంబంధించి ఇటీవల రూ.26 కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.44.46 కోట్లు, సెప్టెంబరు బిల్లు రూ.79.75 కోట్లు కలిపి రూ.124.21 కోట్లు చెల్లించాల్సి ఉంది. అక్టోబరు 27కి బిల్లు కట్టకపోతే సరఫరా నిలిపివేస్తామని విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ గురువారం నోటీసు జారీ చేశారు. దీనిపై యాజమాన్యం మల్లగుల్లాలు పడుతోంది. అటు ఉద్యోగుల జీతాలకు సర్దుబాటు ఎలా?, విద్యుత్ బిల్లులకు నిధులు ఎక్కడి నుంచి తేవాలి?...అనే దానిపై యోచన చేస్తోంది.

సచివాలయ వ్యవస్థను గాడిలో పెడతాం

... 7వ పేజీ తరువాయి

పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో వర్క్ లోడ్ మేరకు సిబ్బందిని కొనసాగించి, మిగిలిన వారిని ఇతర శాఖలకు సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పలు ఇంజనీరింగ్ శాఖలకు బదలాయించి వారి సేవలు వినియోగించుకుంటామన్నారు. మంత్రుల కమిటీ అధ్యయనం తరువాత సచివాలయాల రూపురేఖలు మార్చుతామని మంత్రి అన్నారు.

ఎంఎల్‌సీపీ భవనంలో ఐటీ కంపెనీలు

...7వ పేజీ తరువాయి

ఉందని, ఐటీ కంపెనీలకు ఇవ్వడానికి సుముఖంగా ఉన్నామని కమిషనర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చే ఐటీ పాలసీలో ఉపాధి అవకాశాలు కల్పించే ఐటీ సంస్థలకు భవనం అద్దెలో 50 శాతం రాయితీ ఇవ్వాలని వీఎంఆర్డీఏ యోచిస్తోంది. గతంలోను తెలుగుదేశం ప్రభుత్వం ఐటీకి ఇలాంటి రాయితీలు ఇచ్చింది. ఇప్పుడు దానిని పునరుద్ధరించే అవకాశం ఉండడంతో ఆ స్కీమ్‌లో ఇక్కడ రెండు నుంచి మూడు వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఏయూలో డ్యూయల్ డిగ్రీలు

... 7వ పేజీ తరువాయి

డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రతి పాదిస్తున్నామన్నారు. బీటెక్‌లో వీఎల్ఎస్ఐ, ఎంటెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. అలాగే అనివార్య కారణాల వల్ల మిడ్, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాని, పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం (2018 తరువాత విద్యార్థులకు మాత్రమే) రీ ఎగ్జామినేషన్స్ నిర్వహించాలని నిర్ణయించినట్టు వీసీ తెలిపారు. సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. అనంతరం విభాగాల్లో బీఓఎస్ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయ రావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎ.నరసింహ రావు, జి.గిరిజాశంకర్, కె.సీతామాణిక్యం, ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ, ప్రొఫెసర్ డి.నాగరాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీ

సీతంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఉద్యోగార్థులకు శుక్రవారం క్విజ్ పోటీ నిర్వహించారు. గ్రూప్ 2, ఎస్ఎస్‌సి తదితర పరీక్షల సిలబస్ ఆధారంగా వర్తమాన అంశాలు, చరిత్ర, ఆర్థిక శాస్త్రం, భారత రాజ్యాంగం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం మొదలైన విషయాలపై ప్రశ్నావళి ఇచ్చారు. పోటీలో 50 మంది ఏడు బృందాలుగా పాల్గొన్నారు. గ్రంథాలయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి.వి. సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించి విద్యార్థులకు ఆయన ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విజేతలెవరో నిర్ణయించినా నవంబరు 14న గ్రంథాలయ వారోత్సవాల్లో వారికి బహుమతి ప్రదానం జరుగుతుందని లైబ్రేరియన్ దుర్గారాణి తెలిపారు.

☛ సంక్షిప్తంగా..

శారదా పీఠం భూములు వెనక్కితీసుకోవడంపై హర్షం

ఆరిలోవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లాలో శారదాపీఠానికి రూ.225 కోట్ల విలువైన భూమిని కేటాయిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలపడంపై భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరాంమూర్తి జె.రవి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి భూమి కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు.

ఖైదీలతో ములాఖత్‌కు పెద్ద సంఖ్యలో క్యూ


లెటర్స్ కోసం క్యూలో నిల్చొన్న దృశ్యం

ఆరిలోవ, అక్టోబరు 25 : (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో ఉంటున్న ఖైదీలను చూసేందుకు శుక్రవారం వారి బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ములాఖత్ అనుమతి పత్రాల కోసం వారంతా క్యూ కట్టారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో పాటు పొలం పనులు ఉండడంతో రాలేకపోయామని వారంతా చెప్పారు. ములాఖత్‌కు 100 మందికి పైగా వచ్చారు. వీరు సాయంత్రం 4వ గంటల వరకు శిక్ష అనుభవిస్తున్న తమ వారిని చూసే అవకాశం లభించింది. రిమాండ్ ఖైదీని వారి బంధువులు చూడడానికి వారానికి రెండుసార్లు అవకాశం ఉండగా, శిక్ష పడిన ఖైదీకి 15 రోజులకు రెండుసార్లు కలిసే అవకాశం కల్పిస్తారు.

రోడ్లపై గుంతల పూడ్చివేత



ఆరిలోవ, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి) : హనుమంతువాక జంక్షన్ నుంచి చినగదిలి వరకు గల సర్వీసు రోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డులో గోతుల పూడ్చివేతను జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుండడంతో రోడ్లపై ఉన్న గోతులను తారు, కంకర వేసి పూడ్చివేశారు. ప్రస్తుతానికి పెదగదిలి ప్రాంతంలో ఈ ప్యాచ్ వర్క్‌లు చేపడుతున్నారు.

సినిమా గైడ్

● వీనస్ : మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం),శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
● పొట్టేల్ : వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● ఎంతపనిచేసావ్ చంటి : వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
● లగ్గం : విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)
● దేవర :జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
● వేట్టయాన్ : సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)
● విశ్వం : శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● జనక అయితే గనక : శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 42, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 44, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 44, బీరకాయలు 30, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 28, క్యారేట్ 54 దొండకాయలు 34, బంగాళదుంపలు 31, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 68, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయలు 38, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 125, పొటల్స్ 52, కీరదోస 30, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 28, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220


అధ్వానంగా ఉన్న వీధి రోడ్లు

ఇదేనా 'ఆదర్శ'నగర్!

» వెలగని వీధి దీపాలు
» అధ్వానంగా రహదారులు


వీధి దీపాలు వెలగక అంధకారంలో వీధులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 17వ వార్డు పరిధిలోని ఆదర్శనగర్‌లో కనీస వసతులు కరువవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పేరులోనే 'ఆదర్శం' తప్ప, ఇక్కడ అన్నీ సమస్యలే. ఎన్నోసార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేడంటూ స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా.. ఈ ప్రాంతంలో అధిక శాతం వీధి లైట్లు చాలా రోజుల నుంచి వెలగడం లేదు. చీకటి పడితే అంధకారం నెలకొనడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద కూడా ఉంది. దీంతో రాత్రి వేళల్లో చీకట్లో కుక్కలు వెంబడిస్తుంటాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకట్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి మరీ కరుస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. వీధి కుక్కల భయంతో వాహనాలను వేగంగా పోనిచ్చే క్రమంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్న సంఘటనలు కోకొల్లలు.

అధ్వానంగా రోడ్లు

మరో పక్క వీధి రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉన్నవే చిన్నపాటి వెడల్పు ఉన్న వీధులు. అందులో భూగర్భ డ్రైనేజీ కోసం సీసీ రోడ్లు తవ్వి ఏళ్లు గడిచిపోయినా, కనీసం ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదు. అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని ఇటు కన్నెత్తి చూడటం లేదంటూ ఈ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరిలో కనీస అవగాహన కొరవడి, చిన్నపాటి వీధుల్లోనే తమ వస్తువులను రహదారిపై ఉంచుతున్నారు. దీనివల్ల వీధుల్లో నుంచి ప్రయాణం చేసేవారికి ఇబ్బందిగా ఉంది. పలుసార్లు ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, స్పందన లేదని సామాజిక కార్యకర్త గొనప అప్పన్న పేర్కొన్నారు.

కూటమి పాలనలో ధరాఘాతం : సీపీఐ


ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

ఆరిలోవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో ప్రజలు ఆర్థిక భారంతో కుండిపోతున్నారని, వెంటనే ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆరిలోవ సీపీఐ నేతలు, కార్యకర్తలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆరిలోవ, ఏఎస్ఆర్ నగర్, లక్ష్మీనగర్, సాయినగర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి షేక్ రెహమాన్, అత్తిలి విమల మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. పెరిగిన ధరలను తట్టుకోవడం ప్రజల వల్ల కావడం లేదన్నారు. మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పి గత ప్రభుత్వం విక్రయించిన ధరలకే విక్రయిస్తున్నారని విమర్శించారు. ఆదాయం పెంచుకోవడం కోసం గుడులు, బడులు, నిషేధిత ప్రాంతాల్లో కూడా మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు దేవుడమ్మ, ఆరిలోవ ఏరియా కార్యదర్శి కె.లక్ష్మణరావు, సహాయ కార్యదర్శి కాసుబాబు, ప్రజానాట్య మండలి సభ్యులు చిరంజీవి, ఎ.రవి, పి.పుష్ప, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు

» బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం



ఆరిలోవ, అక్టోబరు 25 : (ఆంధ్రజ్యోతి) : తాను మరణించి మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి జి.జగదీష్ అని రాష్ట్ర జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు అన్నారు. శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన జి.జగదీశ్ (41) ఈ నెల 22న ఇంట్లో ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, తలలో తీవ్రంగా రక్తస్రావం జరుగుతున్నట్టు అక్కడి వైద్యులు తెలిపారు. మూడు రోజులు వైద్యులు శ్రమించినా ఫలితం దక్కలేదు. శుక్రవారం బ్రెయిన్‌డెడ్ అయినట్టు కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. అవయవ దానంపై అవగాహన కల్పించడంతో అందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తెచ్చారు. ఆయన వెంటనే తగిన చర్యలు తీసుకొని జగదీశ్ శరీరం నుంచి కిడ్నీలు, ఊపిరితిత్తులు జీవనధాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియార్టీ ప్రాతిపదికగా మరో ముగ్గురికి కేటాయించారు. తాను చనిపోతూ మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపేలా చేసిన జగదీశ్, అందుకు అంగీకరించిన ఆయన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

చదువును నిర్లక్ష్యం చేయవద్దు

పైడా విద్యాసంస్థల అధినేత కృష్ణప్రసాద్


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కృష్ణప్రసాద్

సిరిపురం, అక్టోబరు 25 : చదువు ఎలాంటి విద్యార్థి అయినా ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడుతుందని, అందుకు చదువును నిర్లక్ష్యం చేయవద్దని పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పైడా డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళా, క్రీడా రంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. ఏ పరిస్థితుల్లో కూడా క్రమశిక్షణ, నిజాయితీని వీడరాదన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సరోజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను పునరుద్ధరించండి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న విదసం నాయకులు

సిరిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం రద్దు చేసిన 20 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, మూత పడిన ఎస్సీ కార్పొరేషన్‌ను తెరిపించి రుణాలు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి విశాఖ దళిత సంఘం (విదసం) ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగర పర్యటనలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీరాంజనేయస్వామిని సిరిపురం సర్క్యూట్‌హౌస్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విదసం రాష్ట్ర కన్వీనర్ బి.వెంకటరావు శారదాపీఠం భూములు వెనక్కి తీసుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అన్యాక్రాంతమైన ఎస్సీల ఆసైన్డ్ భూములు స్వాధీనానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములు కొనుగోలులో జరిగిన అక్రమాలు సరిదిద్దాలని మంత్రిని కోరినట్టు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఈ.సుజాత, ఓంకార్, ఎ.సంతోష్, యు.రాజు, సంతోష్, వై.సంతోష్, ఎం.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రోబోటిక్ అబ్డామినల్ సెర్క్లేజ్ శస్త్రచికిత్స


మహిళతో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

వెంకోజీపాలెం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే తొలిసారిగా బలహీనమైన గర్భాశయం ఉన్న మహిళకు రోబోటిక్ అబ్డామినల్ సెర్క్లేజ్ శస్త్ర చికిత్సను విజయవంతంగా మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కిరణ్మయి గొట్టాపు చేశారు. కొత్త వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన శస్త్రచికిత్స వివరాలను వైద్యులు పేర్కొన్నారు. విశాఖ పరిసర ప్రాంతానికి చెందిన 34 ఏళ్ల మహిళకు గతంలో ఆరుసార్లు అబార్షన్లు, రెటినోపతితో బాధపడుతున్న ప్రీమెట్యూరిటీ ప్రసవం జరిగిందని, ఇవన్నీ కూడా రెండుసార్లు విఫలమైన యోని ఎస్సెర్క్లేజ్‌తో జరిగిందని డాక్టర్ కిరణ్మయి గొట్టాపు తెలిపారు. రోగికి గర్భాశయ లోపం ఉందని, ఇది గతంలో అనేక గర్భధారణ నష్టాలకు దారితీసిందన్నారు. సమస్యను పరిష్కరించడానికి ఇన్వాసివ్ రోబోటిక్ సహాయక అబ్డామినల్ సర్క్లేజ్‌ను ఉపయోగించి శస్త్ర చికిత్సను నిర్వహించి, ఆరోగ్యకరమైన బిడ్డకు మహిళ జన్మనిచ్చిందన్నారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హాని లేకుండా హాయిగా దీపావళి జరుపుకుందాం

గ్రీన్ క్లైమేట్ టీం, సిఫా సంస్థ ప్రతినిధుల పిలుపు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదవాల్తేరు, అక్టోబరు 25 : పశుపక్ష్యాదులకు ఎలాంటి హాని లేకుండా సంప్రదాయబద్ధంగా దీపావళి పండుగ జరుపుకుందామని గ్రీన్ క్లైమేట్ టీం, సిఫా సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కేడీపీఎం ఉన్నత పాఠశాల, ఏయూ తెలుగు మీడియం పాఠశాలలో గ్రీన్ క్లైమేట్ టీం, సిఫా సంస్థలు పర్యావరణం హిత దీపావళి గురించి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాణసంచా కాల్చి శబ్ద, వాయు, జల కాలుష్యం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు రమాదేవి, గ్రీన్ క్లైమెట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి రత్నం, సిఫా సంస్థ ప్రతినిధులు హేమ, నర్సింగ్ ప్రసాద్, ఆంధ్రా యూనివర్శిటీ సోషల్ వర్క్ విద్యార్థినులు, బి.ఉషారాణి, బి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : సీపీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంకబ్రత బాగ్చి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా పెను సవాల్‌గా మారిన సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి సూచించారు. 'సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ' అంశంపై ఎంవీపీ కాలనీలోని ఐఐఎం బిజినెస్ స్కూలులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ డిజిటల్ స్పేస్‌లో పెరుగుతున్న ముప్పులు, సవాళ్లను ఎదుర్కోవడానికి సన్నద్ధం కావడం, సైబర్ నేరాలు వంటి అంశాలపై ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. నేరాల వివిధ రూపాలు, వ్యక్తులు, వ్యాపారాలు, వాటి వల్ల కలిగే నష్టాలు, బెదిరింపులు వంటి విషయాల్లో రక్షించుకోవడానికి అవసరమైన వ్యూహాలు వివరించారు. విద్యార్థి దశ నుంచే సైబర్ సెక్యూరిటీ పరిజ్ఞానంపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవడం అవసరమని పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ ఎస్పీ రవీంద్ర, జాయింట్ డైరెక్టర్ పీఎం బాలాజీ, ప్రొఫెసర్ భవానీ, ప్రొఫసర్ రమ్య పాల్గొన్నారు.

సదస్సులు మేధో చర్చలకు వేదికలుగా నిలవాలి : ఏయూ వీసీ


సదస్సును ప్రారంభిస్తున్న వీసీ శశిభూషణరావు, వేదికపై శ్రీధర్ తదితరులు

వెంకోజీపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సదస్సులు మేధో చర్చలకు వేదికలుగా నిలవాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. శుక్రవారం ఏయూ జియో ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల 'జియో స్పేషియల్ టెక్నాలజీస్ ఆన్ రిజర్వాయిర్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ చాలెంజెస్' జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమకాలిన అంశంపై సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ సంపూర్ణ సమయాన్ని జ్ఞానాన్ని పొందడానికి వెచ్చించాలన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం వాటర్ రిసోర్సెస్ డిపార్టుమెంట్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ వి.శ్రీధర్, ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమేటిక్స్ (ఐఎస్‌జీ) విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ ఆచార్య కె.నాగేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి బాల వీరాంజనేయస్వామి

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖపై సర్క్యూట్‌హౌస్‌లో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీ సుకోవాలన్నారు. భోజనం మెనూ అమలుచేయకుంటే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పెండింగ్ డైట్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీల విడుదలకు హామీ ఇచ్చారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె.రామారావు, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో భూ కబ్జాలు, విధ్వంసాలు

గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు విశాఖపట్నంలో భూకబ్జాలు, విధ్వంసాలకు పాల్పడ్డారని మంత్రి డోలా ఆరోపించారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. నగరంలో మత్తు పదార్థాలు, గంజాయి వ్యాప్తి చెందించారని ధ్వజమెత్తారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందిన నగరంగా విశాఖ నిలుస్తుందన్నారు. తొందరలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తిచేస్తామన్నారు. పంచగ్రామాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. త్వరలో లబ్ధిదారులకు హుద్‌హుద్, టిడ్కో ఇళ్లు అందజేస్తామని మంత్రి తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

పశుగణన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పశుగణన పథకానికి సంబంధించిన గోడ పత్రికను స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా 21వ అఖిల భారత పశుగణన మన రాష్ట్రంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్టు తెలిపారు. ఇంటికి వచ్చే సంబంధిత అధికారగణానికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. డిసెంబరు 31 వరకూ ఈ గణన జరుగుతుందని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరక్టర్ ఎం చంద్రశేఖర్, సహాయ డైరక్టర్ ఎస్ శ్రీనివాస్, వైద్యులు వై పూర్ణిమ, సాయికళ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అధ్యాపకులకు ప్రినిపాల్స్‌గా పదోన్నతి


చంద్రమౌళి


రేఖ


డేవిడ్‌రాజ్

మద్దిలపాలెం, అక్టోబరు 25 : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు అధ్యాపకులు ప్రిన్సిపాల్స్ పదోన్నతులు పొందారు. సీనియర్ అధ్యాపకులు బి.చంద్రమౌళి, కె.రేఖ, టి.శామ్యుల్ డేవిడ్‌రాజ్‌లకు పదోన్నతలు కల్పించి బదిలీ చేశారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చంద్రమౌళి, విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రేఖ, పోరుమామిళ్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శామ్యూల్‌ను నియమించారు. పదోన్నతులు పొందిన అధ్యాపకులను కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు అభినందించారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరి అరెస్టు

ఆరిలోవ అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) : జోడుగుళ్లపాలెం బీచ్ సమీపంలో ఇద్దరు యువలను చాకు చూపించి బెదిరించి డబ్బు తీసుకెళ్లిన ఇద్దరు యువకులను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం సుమారు 4:30 సమయంలో కంద్రెడి లిఖిత్, అతడి స్నేహితుడు కలసి రుషికొండ వైపు నుంచి బీచ్‌రోడ్డు మీదుగా జోడుగుళ్లపాలెం వచ్చి తమ ద్విచక్ర వాహనంపై వచ్చి పాన్‌షాపు వద్ద నిలబడి ఉండగా, గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి సిగరెట్ అడిగారు. తమకు సిగరెట్ తాగే అలవాటు లేదని చెప్పడంతో అక్కడకు వచ్చిన వారిలో ఒక వ్యక్తి.. ఓ యువకుడి ప్యాంటు జేబులో చేయి పెట్టి డబ్బులు తీయబోయాడు. దీంతో ఆ యువకుడు నిలువరించగా వెంటనే చాకు తీసి బెదిరించాడు. ఓ యువకుడి జేబులో ఉన్న రూ.500 తీసుకొని పరార య్యారు. దీనిపై బాధిత యువకులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్ సీఐ డి.బంగారుపాప, ఆరిలోవ క్రైం ఎస్ఐ హరికృష్ణ, కేసు దర్యాప్తు చేపట్టి నిందితులు ఆరిలోవ ప్రాంతానికి చెందిన బండారురాజు, కొండూరు కిరణ్‌లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసులను సీపీ బాగ్చి అభినందించారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం



జగదాంబ కూడలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. కనకమహాలక్ష్మిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఆలయ అధికారులు ఉచిత ప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు.

స్నేహపూర్వక సేవలు



వన్‌టౌన్ సీఐ దేముడు బాబు

జగదాంబకూడలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేముడుబాబు తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో స్నేహపూర్వక సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక శక్తుల ఆగడాలకు అవకాశంలేకుండా నిరంతర పర్యవేక్షణ చేపడతామన్నారు. అల్లూరి జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధుల్లో ఉన్న సీఐ భాస్కరరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

క్షేమ కాళీ పూజలకు పందిరి రాట



రాట వేస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీ గణేష్ వర్తక సేవా సంఘం ఆధ్వర్యంలో క్షేమ కాళీ పూజా మహోత్సవాలను ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4 వరకూ రైల్వేన్యూకాలనీ జంక్షన్‌లో నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా నిర్వాహకులు శుక్రవారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో దాడి శ్రీనివాసరావు, దువ్వి కాళీప్రసాద్, బ్రహ్మాజీ, రాపేటి శ్రీను పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సుల దరఖాస్తులకు నేడే తుది గడువు

కంచరపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) :కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న సాయంకాలం డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు శనివారంతో ముగియనుంది. ప్రొఫెషనల్స్ డిప్లొమా కోర్సులకు సాంకేతిక విద్యా శాఖ ఈ నెల 21న నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సుల నిర్వహణ బాధ్యతను కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలకు అప్పగించింది. వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న అభ్యర్థుల నుంచి ఇప్పటికే అధిక సంఖ్యలో దరఖాస్తులు అందాయి. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలతో అభ్యర్థులు దరఖాస్తులు అందజేస్తున్నారు. ఇంటర్ ఎంపీసీ/బైపీసీ/ఐపీసీతో పాటు పదోతరగతి అనంతరం రెండేళ్ల వ్యవధి గల ఐటీఐ కోర్సులు పూర్తిచేసి వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న వారికి ఈ కోర్సులను సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కోర్సుల్లో చేరి శిక్షణ పొందిన వారు ఉద్యోగులైతే పదోన్నతి, విద్యార్హతలు పెంచకోవచ్చు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పొందడానికి అర్హులవుతారు.

విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు శశిప్రియాంక

కంచరపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆర్పీపేట హెల్త్ సెంటర్ డాక్టరు శశిప్రియాంక హాజరై చిన్నారులకు ఆర్‌బీఎస్‌కె స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. పాఠశాల విద్యార్థులందరికీ పరీక్షలు చేపట్టి వారిలో ముగ్గురిని ఆయా విభాగాల ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా డా.శశి ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలుంటే వారిని లేతవయసులోనే గుర్తించి తగిన వైద్యం అందిస్తామన్నారు. స్క్రీనింగ్ పరీక్షల్లో భాగంగా వినికిడి, దృష్టిలోపం, ఆర్థో సమస్యలు, రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి వైద్య సహాయం, మందులు పంపిణీ చేస్తామన్నారు. పాఠశాల హెచ్‌ఎం మేరీ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్ నుంచి డాబాగార్డెన్ వైపు వచ్చే మార్గంలో దుకాణాలు



ఎల్ఐసీ దారిలో రోడ్డుకు ఆనుకుని వ్యాపారాలు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

- డాబాగార్డెన్స్ టూ ఎల్ఐసీ కూడలి వరకు
- పాదచారుల నడకకు చోటే లేదు

డాబాగార్డెన్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ నుంచి ఎల్ఐసీకి వెళ్లే దారిలో పాదచారులు నడిచివెళ్లామంటే రోడ్డు శరణ్యంగా మారుతోంది. నిత్యం పెద్ద సంఖ్యలో డాబాగార్డెన్స్ నుంచి ఎల్ఐసీ ప్రాంతానికి వేర్వేరు పనులపై వస్తుంటారు. అనేక వాణిజ్య దుకాణాలు, విద్యాసంస్థలు, ఇతరత్రా కార్యాలయాలు ఇక్కడుంటాయి. అయితే రోడ్డు మధ్య నుంచి పాదచారులు నడవాల్సిన పరిస్థితి వచ్చిందంటే ఎంతగా ఇక్కడ ఫుట్‌పాత్‌లను ఆక్రమించేశారో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా డాబాగార్డెన్స్ బస్టాప్ , స్వీట్ఇండియా, యూనియన్ బ్యాంకు, సెంట్రల్ పాయింట్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, కొద్దిగా ముందుకెళితే...పోస్టాఫీస్.. ఇలా... దేనినీ వదలకుండా ఆక్రమించేయడంతో ఫుట్‌పాత్ కానరావడం లేదు. దీంతో సాయంత్రం వేళల్లో పాదచారులు నడవాలంటే హడలిపోతున్నారు. కొంత సేపు సేద తీరుదామంటే కుదరడం లేదని వాపోతున్నారు. కొందరైతే ఏకంగా కార్లను ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేస్తున్నారు. మరికొందరు తమ వ్యాపార అవసరాలకు ఏకంగా ఫుట్‌పాత్‌ను వాడేస్తున్నారు. అసలే రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇలా ఫుట్‌పాత్‌లను ఆక్రమించేస్తే ఎలా? అంటూ పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లను ఆక్రమణలు లేకుండా చూడాలని, కనీసం నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేజీహెచ్ క్యాజువాలిటీ అభివృద్ధికి రూ.కోటి



పోర్టు యాజమాన్య ప్రతినిధుల నుంచి చెక్కు అందుకుంటున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ అవుట్ పేషెంట్ క్యాజువాలిటీ విభాగంలో సౌకర్యాల కల్పనకు విశాఖ పోర్టు యాజమాన్యం రూ.కోటి అందజేసింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ ఇందుకు సంబంధించిన చెక్కును కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు అందజేశారు. కేజీహెచ్‌లో ఓపీ క్యాజువాలిటీ విభాగాలు ఏర్పాటు చేసి సుమారు వందేళ్లు కావటంతో, ఎప్పటికప్పుడు అవసరాలను సమకూరుస్తున్నా అత్యంత దయనీయ స్థితిలోనే ఉంటున్నాయి. దీనితో సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ వీటి అభివృద్ధి ఆవశ్యకతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఈ విషయంపై విశాఖపట్నం పోర్టు యాజమాన్యంతో చర్చించారు. స్పందించిన పోర్టు యాజమాన్యం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.కోటి సమకూర్చేందుకు అంగీకరించి, శుక్రవారం చెక్కును కలెక్టర్‌కు అందజేసింది. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు,

రోలర్ స్కేటింగ్‌లో మోక్షితకు స్వర్ణ పతకాలు



విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్‌లో చిన్నారి కె.మోక్షిత అద్భుతంగా రాణించి రెండు స్వర్ణ పతకాలు సాధించింది. వుడా పార్కు రింక్‌లో శుక్రవారం జరిగిన ఈ టోర్నీ బాలికల ఆరు సంవత్సరాల వయసు విభాగంలో మోక్షిత పతకాలు సాధించి త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా కోచ్ కృష్ణకుమార్, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు మోక్షితను అభినందించారు.

'ఆలోచింపజేసే చిత్రం...ఎంత పని చేశావ్ చంటి'



విజయోత్సవంలో పాల్గొన్న చిత్ర యూనిట్ సభ్యులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అందరినీ ఆలోచింపజేసే చిత్రమే 'ఎంత పని చేశావ్ చంటి' అని చిత్ర కథానాయకుడు శ్రీనివాస్, దర్శకుడు ఉదయకుమార్, కథానాయికలు నిహారిక, శాంతిప్రియ అన్నారు. శుక్రవారం చిత్ర విజయోత్సవంలో భాగంగా డాబాగార్డెన్స్ వెంకటేశ్వర థియేటర్‌లో చిత్ర యూనిట్ సభ్యులు సందడి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలి రోజే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. కుటుంబంలో జరిగే సంఘటనల ఆధారంగా ఉన్న సినిమా కావడంతో ప్రేక్షకుల మన్ననలు పొందిందన్నారు. వివాహమైన వ్యక్తిలో అంతర్గతంగా ఉండే లక్షణాలు చంటి పాత్రలో చూపించామన్నారు. ఐదు కుటుంబాల మధ్య జరిగిన సంఘటనలు ఈ సినిమాలో ఉన్నాయన్నారు.

బాక్సింగ్‌లో క్రీడాకారులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ లక్ష్మీనరస, పీడీ సునంద్

అక్కయ్యపాలెం, అక్టోబరు 25 (అక్కయ్యపాలెం) : హర్యానాలో జరిగిన ఆర్‌ఈసీ బాక్సింగ్ టాలెంట్ హంట్ స్పోర్ట్స్ మీట్‌లో ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి. నిహారికకు బంగారు పతకం, కె.గ్రీష్మితకు కాంస్య పతకం లభించింది. ఈ మేరకు వీరిని పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీనరస, పీడీ సునంద్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. రానున్న రోజుల్లో మరింతగా రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

కోయంబత్తూర్‌కు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా కోయంబత్తూరు, బరౌని మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 06055 నంబరు గల రైలు ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకు ప్రతి శనివారం ఉదయం 11.50 గంటలకు కోయంబత్తూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06056 నంబరు గల రైలు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 19 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరి గురువారం ఉదయం 3.48 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుతుంది. ఆరు థర్డ్ ఏసీ, ఎనిమిది స్లీపర్, జనరల్ సెకెండ్ క్లాసు, సెకెండ్ క్లాసు , దివ్యాంగుల కోచ్‌లు ఉంటాయన్నారు.

నేడు పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ కారణంగా శనివారం పలు రైళ్లను రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045), హౌరా-తిరుపతి హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (20889), షాలిమార్-తిరునెల్వేలి ప్రత్యేక రైలు (06088), హౌరా-బెంగళూరు దురంతో ఎక్స్‌ప్రెస్ (12245)లు రద్దు చేశామని పేర్కొన్నారు.

'స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి'



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో సంభాషిస్తున్న రహేజా గ్రూపు ప్రతినిధులు

సీతమ్మధార, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇనార్బిట్‌మాల్ రహేజా గ్రూప్ ఉన్నత యాజమాన్య ప్రతినిధులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఇనార్బిటల్ మాల్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. విశాఖపట్నంలో ఇతర ప్రదేశాల్లో కూడా రహేజా గ్రూప్ సంస్థలు మరిన్ని పెట్టుబడులు పెట్టి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాదనకు ఆ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.

వేతన సవరణకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా వేతన, పెన్షన్ సవరణలు చేపట్టకుండా తమ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులతో తప్పించుకుంటున్నాయని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ శుక్రవారం డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పుడు విధానాల కారణంగానే బీఎస్ఎన్ఎల్ నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. దీనికి ఉద్యోగులను బాధ్యులను చేయడం దారుణమ న్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్యనిధి, ఈఎస్ఐ సామాజిక భద్రతకు యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పీఈసీ హెచ్‌డీ సాగర్, సీఐటీయూ కుమార్‌మంగళం, పీఎస్‌యూ లచ్చిరాజు, బీఎస్ఎన్ఎల్ నాయకులు రామాంజనేయులు, ఏఐబీడీపీఏ మూర్తి, సీసీడబ్ల్యూఎఫ్ లక్ష్మీనారాయణ, గోవిందరావు, శ్యామల, చక్రి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ప్రారంభించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యేలు/ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధిష్ఠానం ఆదేశించింది. రూ.100 సభ్యత్వంతో కార్యకర్తలకు రూ. ఐదు లక్షల ప్రమాద బీమా వర్తించనున్నది. భీమిలి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తారు. ఎంవీపీ కాలనీలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయంలో 10గంటలకు సీనియర్ కార్యకర్తకు సభ్యత్వం అందిస్తారు. ఉత్తర పరిధి బర్మాక్యాంపు ఏఎస్ఆర్ నగర్‌లో ఎంపీ శ్రీభరత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, గోపాలపట్నంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, గాజువాక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా, సబ్బవరం జీఎస్ కల్యాణ మండపంలో ఇన్‌చార్జి గండి బాబ్జీ, జాలారిపేటలో దక్షిణ ఇన్‌చార్జి సుధాకర్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సభ్యత్వం తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వివరించారు.

రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని విజయనగరం, రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ శుక్రవారం పర్యటించి భద్రతా తనిఖీలు చేపట్టారు. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద భద్రతా ఆడిట్ నిర్వహించి, ఈ మార్గంలో జరుగుతున్న మూడో లైను నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అక్కడ నంచి కూనేరు, రాయగడ స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, యార్డు కార్యకలాపాల పనులను తనిఖీ చేశారు. ప్రయాణికులకు లభిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, సివిల్ ఇంజనీరింగ్, సిగ్నల్ అండ్ టెలికాం, మెకానికల్, ఎలక్ట్రికల్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, కమర్షియల్, ఆపరేషన్స్ అధికారులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజారులో దుకాణాల కేటాయింపు

సీతమ్మధార, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్‌లో రైతులకు దుకాణాలు కేటాయించారు. లాటరీ ద్వారా దక్కిన దుకాణంలో మాత్రమే అమ్ముకునే విధంగా పారదర్శకంగా కేటాయించినట్లు బజార్ ఎస్టేట్ అధికారి కొండ బాబు తెలిపారు. బజార్‌లో శుక్రవారం రైతులకు డ్రా నిర్వహించారు. దీని ద్వారా వచ్చిన దుకాణాల్లోనే అమ్మకాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



ఇన్‌చార్జ్ మంత్రి వీరాంజనేయస్వామిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ..

డాబాగార్డెన్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని అభ్యర్థించారు.

దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు

... 7వ పేజీ తరువాయి

48 గంటల్లో డెలివరీ ఇస్తుంటారు. గ్రామీణ ప్రాంతంలో మరో రోజు ఆలస్యమవుతుంది. ఇంటికి సిలిండర్ వచ్చిన 48 గంటలలోపు వినియోగదారుని బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. నాలుగు నెలలకు ఒకసారి ఉచిత సిలిండర్ పొందవచ్చు. ఇందుకు సంబంధించి విధి విధానాలు ఇంకా పౌర సరఫరాల శాఖ అధికారులకు అందాల్సి ఉంది. ప్రస్తుతం విశాఖ నగరంలో సిలిండర్‌కు కంపెనీలు రూ.811 తీసుకుంటున్నాయి.

ఉక్కుకు విద్యుత్ చిక్కు

...7వ పేజీ తరువాయి

చెల్లించకపోతే సరఫరా చేయడం కష్టమని చెప్పడంతో ఆగస్టు బిల్లుకు సంబంధించి ఇటీవల రూ.26 కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.44.46 కోట్లు, సెప్టెంబరు బిల్లు రూ.79.75 కోట్లు కలిపి రూ.124.21 కోట్లు చెల్లించాల్సి ఉంది. అక్టోబరు 27కి బిల్లు కట్టకపోతే సరఫరా నిలిపివేస్తామ ని విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ గురువారం నోటీసు జారీ చేశారు. దీనిపై యాజమాన్యం మల్లగుల్లాలు పడుతోంది. అటు ఉద్యోగుల జీతాలకు సర్దుబాటు ఎలా?, విద్యుత్ బిల్లులకు నిధులు ఎక్కడి నుంచి తేవాలి?..అనే దానిపై యోచన చేస్తోంది.

సచివాలయ వ్యవస్థను గాడిలో పెడతాం

... 7వ పేజీ తరువాయి

పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో వర్క్ లోడ్ మేరకు సిబ్బందిని కొనసాగించి, మిగిలిన వారిని ఇతర శాఖలకు సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పలు ఇంజనీరింగ్ శాఖలకు బదలాయించి వారి సేవలు వినియోగించుకుంటామన్నారు. మంత్రుల కమిటీ అధ్యయనం తరువాత సచివాలయాల రూపురేఖలు మార్చుతామని మంత్రి అన్నారు.

ఎంఎల్‌సీపీ భవనంలో ఐటీ కంపెనీలు

...7వ పేజీ తరువాయి

ఉందని, ఐటీ కంపెనీలకు ఇవ్వడానికి సుముఖంగా ఉన్నామని కమిషనర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చే ఐటీ పాలసీలో ఉపాధి అవకాశాలు కల్పించే ఐటీ సంస్థలకు భవనం అద్దెలో 50 శాతం రాయితీ ఇవ్వాలని వీఎంఆర్డీఏ యోచిస్తోంది. గతంలోను తెలుగుదేశం ప్రభుత్వం ఐటీకి ఇలాంటి రాయితీలు ఇచ్చింది. ఇప్పుడు దానిని పునరుద్ధరించే అవకాశం ఉండడంతో ఆ స్కీమ్‌లో ఇక్కడ రెండు నుంచి మూడు వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఏయూలో డ్యూయల్ డిగ్రీలు

... 7వ పేజీ తరువాయి

డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రతి పాదిస్తున్నామన్నారు. బీటెక్‌లో వీఎల్ఎస్ఐ, ఎంటెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. అలాగే అనివార్య కార ణాల వల్ల మిడ్, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాని, పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం (2018 తరువాత విద్యార్థులకు మాత్రమే) రీ ఎగ్జామి నేషన్స్ నిర్వహించాలని నిర్ణయించినట్టు వీసీ తెలిపారు. సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. అనంతరం విభా గాల్లో బీఓఎస్ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయ రావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎ.నరసింహ రావు, జి.గిరిజాశంకర్, కె.సీతామాణిక్యం, ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ, ప్రొఫెసర్ డి.నాగరాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీ

సీతంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఉద్యోగార్థులకు శుక్రవారం క్విజ్ పోటీ నిర్వహించారు. గ్రూప్ 2, ఎస్ఎస్‌సి తదితర పరీక్షల సిలబస్ ఆధారంగా వర్తమాన అంశాలు, చరిత్ర, ఆర్థిక శాస్త్రం, భారత రాజ్యాంగం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం మొదలైన విషయాలపై ప్రశ్నావళి ఇచ్చారు. పోటీలో 50 మంది ఏడు బృందాలుగా పాల్గొన్నారు. గ్రంథాలయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి.వి. సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించి విద్యార్థులకు ఆయన ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విజేతలెవరో నిర్ణయించినా నవంబరు 14న గ్రంథాలయ వారోత్సవాల్లో వారికి బహుమతి ప్రదానం జరుగుతుందని లైబ్రేరియన్ దుర్గారాణి తెలిపారు.

సమన్వయంతో పనిచేద్దాం

... 7వ పేజీ తరువాయి

సంబంధించి డబ్బులు జమ అవుతాయన్నారు. సీఎస్ఆర్ నిధులతో కేజీహెచ్‌లో ఓపీ బ్లాక్ అభివృద్ధి చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు.

మంత్రి దృష్టికి సమస్యలు

జిల్లాలో వివిధ సమస్యలను పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పరిపాలనాపరమైన అంశాల్లో అధికారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే అధికారులకు అండగా ఉంటామన్నారు. ఉత్సాహంగా ఉండే ఉద్యోగులకు ప్రోత్సాహం, డల్‌గా ఉండే ఉద్యోగులకు పనిష్మంట్ ఉంటాయన్నారు. రుషికొండ సమీపంలో కొత్తగా వేసిన రోడ్డును ప్రారంభించాలని మంత్రిని కోరారు. దీనివల్ల పర్యాటకం పెరుగుతుందన్నారు. గాజువాక ప్రాంతంలో కన్వెన్షన్ డీడీ, 22ఏ భూముల విషయంలో సడలింపులు ఇవ్వాల్సి ఉందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గంగవరం పోర్టు నిర్వాసితులకు పరిహారం, ఉద్యోగాల కల్పన గురించి ప్రస్తావించారు. అలాగే జెట్టీ నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. పొల్యూషన్ బోర్డు మెంబర్ సెక్రటరీ విశాఖలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, అందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. నేవల్ డాక్‌యార్డు వద్ద ప్రత్యామ్నాయ మార్గాన్ని కల్పించాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కోరారు. పంచ గ్రామాల సమస్యను కొలిక్కి తీసుకురావాలని కోరారు. డెత్ సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులను పరిష్కరించాలని, నివాసాల మధ్యలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలను తొలగించాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రస్తావించారు. నగరంలో హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుచేయాలని, అందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కోరారు. మత్స్యకారులకు ఇళ్లు ఇవ్వాలన్నారు. ప్రజా ప్రతినిధులు సిఫారసులను పరిగణనలోకి తీసుకునేలా, అధికారులు త్వరితగతిన స్పందించేలా చూడాలంటూ ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. మంచి ప్రభుత్వం అనే నినాదాన్ని పాటిస్తూ ప్రజలకు సత్వరమే సేవలు అందించేలా చూడాలన్నారు.

వేగంగా విమానాశ్రయానికి చేరుకునేలా రోడ్లు వేయాలి

సమావేశానికి హాజరైన జీఎంఆర్ గ్రూపు ప్రతినిధులు కీలక అంశాలను ప్రస్తావించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ప్రతినిధులు..విశాఖ సిటీ నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వేగంగా చేరుకునేలా రోడ్లు అభివృద్ధి చేయాలని కోరారు. లంకెలపాలెం నుంచి తగరపువలస వరకు 12 ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ఆయా చోట్ల పై ఓవర్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇప్పుడున్న జాతీయ రహదారి 16, రాష్ట్ర రహదారులను విస్తరించాలని సూచించారు. నాగపూర్‌లో మాదిరిగా డబుల్ డెక్కర్ మోడల్‌లో రోడ్లు వేయాలని, బీచ్ రోడ్లను అనుసంధానం చేయాలని సూచించారు. దీనిపై స్థానిక ఎంపీ భరత్ స్పందిస్తూ..ప్రస్తుత జాతీయ రహదారిని విస్తరించాలంటే మెట్రో ప్రాజెక్ట్ కారిడార్ కొలిక్కి రావాలని, అప్పుడే సమాంతరంగా పనులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. బీచ్ రోడ్డును అనుసంధానం చేస్తే వాహనాల వేగం పెరుగుతుందని, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జిల్లాలో చేపట్టబోయే ప్రాజెక్టులు గురించి, స్థితిగతులు గురంచి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాన్నామని చెప్పారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రజెంటేషన్ ఇస్తూ జిల్లాలో శాంతి, భద్రతల పరిరక్షణకు వినూత్న చర్యలు చేపడుతున్నామని, దీనిలో భాగంగా గస్తీ పెంచామన్నారు. వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాస్టర్ ప్లాన్‌పై పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతు బజార్‌లో ప్రైవేటు వ్యాపారుల దందా

- బయటకు తరలిపోతున్న రాయితీ ఉల్లి, టమాటా
- చోద్యం చూస్తున్న పర్యవేక్షణ సిబ్బంది
- కొనుగోలుదారులకు తప్పని నిరాశ



గాజువాక మహిళా రైతు బజార్


టమాటా కౌంటరు వద్ద కొనుగోలుదారులు

గాజువాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉల్లి, టమాటా ధరలు గత కొద్ది రోజులుగా ఆకాశానంటడంతో సామాన్యులు కొనుగోలు చేసుకునే పరిస్థితి కనిపించటం లేదు. ప్రభుత్వం ఉల్లి, టమాటాలను సబ్సిడీ ధరలకు విక్రయించే విధంగా రైతుబజార్లలో కౌంటర్లుఏర్పాటు చేసింది. అయితే రైతుబజార్‌లోని వ్యాపారులు, బయట వ్యాపారులతో కుమ్మక్కై సబ్సిడీ ఉల్లి, టమాటాలను ప్రైవేటు వ్యాపారులకోసం బయటకు తరలిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా గాజువాకలోని ఒకే ఒక్క మహిళా రైతుబజార్ ఉండటంతో ఇక్కడకు అధిక సంఖ్యలో కొనుగోలుదారులు వస్తున్నారు. ఉదయం నుంచే ఉల్లి, టమాటాల కోసం క్యూ కడుతున్నారు. అయితే అధిక సమయం వీటి కోసం క్యూలో ఉన్నప్పటికీ దొరక్కపోవటంతో పలువురు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

రైతుబజార్‌లో టమాటా ధర కిలో రూ.48, ఉల్లిపాయలు రూ.54 విక్రయిస్తుండగా, ఇదే ప్రైవేటు మార్కెట్‌లో టమాటా, ఉల్లి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. దీంతో అధిక శాతం మంది రైతుబజార్‌లో కొనుగోలు చేసేందుకు తరలివస్తున్నారు. అయితే రైతుబజార్‌లో ఉల్లి, టమాటాలతో పాటు ఇతర కూరగాయాలు తక్కువ ధరకు లభిస్తుండటంతో ప్రైవేటు వ్యాపారులు కూరగాయలను కూడా అధిక మొత్తంలో ఇక్కడ కొనుగోలు చేసి బయట అమ్మకాలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల రైతుబజార్లలో కూరగాయలు కొందామన్నా లేకుండా పోతున్నాయని కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలుదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించాల్సిన సంబంధిత సిబ్బంది పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల గాజువాక మహిళా రైతుబజార్‌లో ప్రైవేటు వ్యక్తుల దందా సాగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదిలావుండగా.. కొనుగోలుదారుల పట్ల రైతుబజార్‌లో కొందరు అమ్మకందారులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. తూకం విషయంలో గాని, ధరల విషయంలో కూడా వ్యత్యాసాలు వస్తున్నాయంటూ పలుమార్లు పర్యవేక్షణ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతోందని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు.

అంధకారంలో దువ్వాడ రైల్వేస్టేషన్ పరిసరాలు

- మరమ్మతుకు గురైన వందలాది వీధి దీపాలు


వీధి లైట్లు వెలగకపోవడంతో చీకటిగా ఉన్న పరిసరాలు

ఆటోనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ రైల్వే స్టేషన్ రహదారుల్లో చీకటి పడితే అంధకారం అలముకుంటోంది. ఈ ప్రాంతంలో వందలాది వీధి దీపాలు మరమ్మతులకు గురవడంతో వెలగడం లేదు. ఎప్పటి నుంచో వీటి స్థానంలో కొత్త బల్బులు వేయకపోవడంతో చీకటి పడిసరికి పలు కాలనీల్లో అంధకారం ఆవరిస్తోంది. రాత్రి సమయాల్లో రైళ్లు దిగిన ప్రయాణికులు ఇళ్లకు చేరేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే వీఎస్ఈజెడ్‌లో అర్ధరాత్రి విధులు పూర్తి ముగించుకొని ఇళ్లకు చేరుకునే కార్మికులు కుక్కల బారిన పడుతున్నారు. చీకటిగా ఉండడంతో రహదారులపై ఉన్న గోతులను గమనించక పలువురు ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. విష సర్పాలు అధికంగా సంచరించే ప్రాంతం కావడంతో రాత్రిళ్లు బయటకు వచ్చేందుకు స్థానికులు భీతిల్లుతున్నారు. గత కొద్ది రోజులుగా పాముల సంచారం అధికమయిందని, చిల్లర దొంగలు ప్రవేశిస్తున్నారనే ఫిర్యాదులు అధికమవుతున్నాయి. తక్షణమే జీవీఎంసీ అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



వడ్లపూడి రైతు బజార్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తిరుమలనగర్ కాలనీవాసులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి చేపల, మాంసం మార్కెట్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాలిథిన్‌ను వినియోగించరాదంటూ తిరుమలనగర్‌లో కాలనీ వాసులు శుక్రవారం వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. చేపలు, మాంసాలకు స్టీలు బాక్సులు తీసుకు వెళ్లాలని, మార్కెట్‌లకు గుడ్డ సంచులను వినియోగించాలని, భావితరాల భవిష్యత్తును పాడు చేయరాదంటూ ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, పరమానందం, మూర్తి, వసంత రెడ్డి, సన్యాసిరావు, భాస్కరరావు, సోమరాజు తదితర కాలనీ వాసులు ఉన్నారు.

కణితి ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు


ఎస్ఐ లక్ష్మితో వ్యాసరచన పోటీల విజేతలు, ఉపాధ్యాయులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకొని జీవీఎంసీ 87 వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోలీస్ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దువ్వాడ ఎస్సై కేటీఆర్ లక్ష్మి పాల్గొని ప్రస్తుత సమాజంలో పోలీసుల పాత్ర, అమర వీరులైన పోలీసులు త్యాగం, వారు సాధించిన విజయాలను వివరించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బి.సూర్యప్రకాష్, మన్నాజీ, షేక్ ప్రసాద్, హెచ్‌సీ డి.రాజు, సీసీ ఎంఎస్ రాజు, స్వాతి, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు



అగనంపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల అరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు


మాట్లాడుతున్న అప్పలనాయుడు

వేపగుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రజా రవాణా శాఖ జిల్లా ఇన్‌చార్జి బి. అప్పలనాయుడు సూచించారు. శుక్రవారం ఆయన సింహాచలం డిపోలో గ్యారేజి, పలు విభాగాలను సందర్శించి, ఉద్యోగులతో మాట్లాడారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎప్పటికప్పుడు బస్సుల కండిషన్‌ను తనిఖీ చేయాలని, నిషేధిత వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కె. రాజశేఖర్, జె. తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

పెదగంట్యాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ మండలం సత్యనారాయణపురం సమీపంలోని వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ స్క్రాప్ కొట్టు దగ్గర శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. కొట్టు ముందుకు కుప్పగా పోసిన ప్లాస్టిక్ వ్యర్థాలు ఇతర స్క్రాప్ ఉన్నాయి. ఇవి హెచ్‌టీ విద్యుత్తు లైన్ల కింద ఉన్నాయి. హెచ్‌టీ విద్యుత్తు వైర్ల ఒకదానికొకటి రాసుకోవడంతో వాటి నుంచి నిప్పులు వెలువడి అవి ప్లాస్టిక్, స్క్రాప్ కుప్పలపై పడి మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే పెదగంట్యాడ అగ్నిమాపక దళానికి సమాచారం అందివ్వడం అగ్నిమాపక వాహనాలతో పాటు సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

సాంఘిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి బాల వీరాంజనేయస్వామి

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సాం ఘిక సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖపై సర్క్యూట్‌హౌస్‌లో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం తో పాటు పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీ సుకోవాలన్నారు. భోజనం మెనూ అమలుచేయకుంటే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పెండింగ్ డైట్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీల విడుదలకు హామీ ఇచ్చారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె.రామారావు, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో భూ కబ్జాలు, విధ్వంసాలు

విశాఖపట్నం: గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు విశాఖపట్నంలో భూకబ్జాలు, విధ్వంసాలకు పాల్పడ్డారని మంత్రి డోలా ఆరోపించారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. నగరంలో మత్తు పదార్థాలు, గంజాయి వ్యాప్తి చెందించారని ధ్వజమెత్తారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందిన నగరంగా విశాఖ నిలుస్తుందన్నారు. తొందరలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తిచేస్తామన్నారు. పంచగ్రామాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. త్వరలో లబ్ధిదారులకు హుద్‌హుద్, టిడ్కో ఇళ్లు అందజేస్తామని మంత్రి తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

కోనేరులో తుప్పల తొలగింపు



తుప్పలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అగనంపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడిలో గల కోనేరు నిర్వహణ పనులు చేపట్టేలా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. గత కొన్ని నెలలుగా పట్టించుకోపోవడంతో కోనేరు చుట్టూ ముళ్ల పొదలు, మొక్కలు పెరిగిపోయాయి. దీంతో స్థానికులు ఇక్కడకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై 'దుర్భరంగా అగనంపూడి కోనేరు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించి కోనేరు చుట్టూ చెరువు గర్భంలో పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. మరో రెండు రోజుల పాటు పనులు నిర్వహించి కోనేరును అందరికీ అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సచివాలయం కార్యదర్శి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

పెదగంట్యాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దయాల్‌నగర్‌లో శనివారం నుంచి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దయాళ్‌నగర్ గౌరీ సేవా సంఘం ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నది.ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం వందలాది మంది మహిళలు గ్రామశివారుకు వెళ్లి అక్కడి నుంచి ఊరేగింపుగా వరి దుబ్బు తెచ్చి ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నారు. అనంతరం గౌరీ పరమేశ్వరులను ప్రతిష్ఠించనున్నారు. 27 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సినిమా గైడ్

- **వీనమ్:** మెలోడీ, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **పొట్టేల్:** వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎంతపనిచేసావ్ చంటి :** వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **లగ్గం :** విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **దేవర:** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **వేట్టయాన్:** సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **విశ్వం :** శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక:** శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 42, వంకాయలు (తెలుపు) 42,వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 44, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 44, బీరకాయలు 30, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 28, క్యారెట్ 54 దొండకాయలు 34, బంగాళదుంపలు 31, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)68, బరబటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయ 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 125, పొటల్స్ 52, కీరదోస 30, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 28, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన 5, చుక్కకూర 4, పాల కూర 4, తోటకూర 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

మహాధర్నాలో ప్రజలంతా పాల్గొనాలి

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆదినారాయణ తదితరులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 28న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న 1352వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉపాధి అవకాశాలకు ప్రభుత్వ రంగ పరిశ్రమలే కీలకమన్నారు. ఉపాధి అవకాశాలును మెరుగు పరుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే నిరుద్యోగం పెరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయిస్తూ, ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ శ్రీభరత్‌ను కలిసిన సంఘ నేతలు

కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కృషి చేయండి

- ఎంపీ శ్రీభరత్‌కు ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకుల వినతి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీ శ్రీభరత్‌కు ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. నగరంలో శుక్రవారం కలిసి పలు సమస్యలను విన్నవించారు. కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వటం లేదని, కొన్ని విభాగాల్లో టెండర్ల ప్రక్రియ ముగిసినప్పటికీ మళ్లీ నూతన టెండర్లు వేయలేదన్నారు.దీంతో కార్మికులకు ఉపాధి పోయిందన్నారు. అలాగే ఇప్పుడు కాంట్రాక్టు కార్మికులకు వైద్య పరీక్షల పేరుతో ఇబ్బందులకు గురిచేసిందని వివరించారు. కాంట్రాక్టు కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలని సంఘ నేతలు కోరారు. ఎంపీకి వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ నేతలు మంత్రి రవి, ఎస్. రమణ, పిట్టా రెడ్డి,తాతారావు, బి.పైడిరాజు, రాజేష్, నరసింగరావు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు


ఫార్మాసిటీ కాలనీలో అక్రమణలను పరిశీలిస్తున్న ఎస్‌డీసీ రమామణి, తదితరులు

అగనంపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ అనుకొని సర్వే నంబరు 231 ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను శుక్రవారం గాజువాక రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు తొలగించారు. ఇటీవల కొందరు ప్రభుత్వ భూమిని అక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీ ఎస్‌డీసీ రమామణి పరిశీలించారు. ప్రభుత్వ భూమిని అక్రమించుకొని నిర్మాణాలు చేపడితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఆమె దగ్గర ఉండి అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఆమె వెంట ఆర్ఐలు ఈశ్వరరావు, మహేశ్, సచివాలయం సిబ్బంది ఉన్నారు.


పశు గణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

పశుగణనకు సహకరించాలి : ఎమ్మెల్యే

ఎన్ఏడీ జంక్షన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పశుగణన కార్యక్రమానికి రైతులు సహకరించాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కోరారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పశుగణనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ వద్ద ఉన్న పశువులు, పెంపుడు కుక్కలు, కోళ్ల సమాచారం పశుసంవర్థక శాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు.పశుగణన ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని చెప్పారు. గోపాలపట్నం పశువైద్యశాల సహాయ సంచాలకుడు ఎ. రవికుమార్ మాట్లాడుతూ పశుగణన ద్వారా జంతువుల వృద్ధి, తదితర విషయాలు తెలుసుకోవడానికి ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ బి. స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో పశుగణన ప్రారంభం

సింధియా : దేశ వ్యాప్తంగా 21వ పశుగణన శుక్రవారం మొదలవుతుందని, ఫిబ్రవరి వరకూ కొనసాగుతుందని పశు వైద్యుడు డాక్టర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో శుక్రవారం నిర్వహించిన పశుగణగలో ఆయన మాట్లాడుతూ స్థానిక పశువుల ఆస్పత్రి పరిధిలో పశుగణన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఐఐసీ స్థలంలో బాణసంచా విక్రయాలు

మల్కాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గాజువాక ఆర్టీసీ డిపో పక్కనున్న ఏపీఐఐసీ (బెల్లం వినాయకుడి) స్థలంలో బాణసంచా విక్రయాలకు అనుమతి లభించింది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న శ్రీహరిపురం జీవీఎంసీ మైదానంలో బాణసంచా విక్రయాలకు ప్రయత్నించారు. అయితే వివిధ కారణాల వల్ల ఆ మైదానంలో అనుమతులు లభించకపోవడంతో బెల్లం వినాయకుడి స్థలంలో అమ్మకాలకు వ్యాపారాలు అనుమతులు తెచ్చుకున్నారు. ఇక్కడ దాదాపు 46 దుకాణలు ఏర్పాటు కానున్నాయి. ఈనెల 29, 30, 31 తేదీల్లో బాణసంచా అమ్మకాలకు వ్యాపారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బీజేపీలోకి 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన ?

వ్యతిరేకిస్తున్న స్థానిక కూటమి నాయకులు


ముమ్మనకు వ్యతిరేకంగా ప్లకార్డులు చూపిస్తున్న నాయకులు

పెందుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 95వ వార్డు వైసీపీ కార్పొరేటర్ ముమ్మన దేవుడు బీజేపీలో చేరనున్నారు.ఇటీవల ఆయన తన ముఖ్య అనుచరులతో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను కలిశారు. ఈమేరకు శనివారం సాయంత్రం 4 గంటలకు చినముషిడివాడలో ఎంపీ రమేశ్ సమక్షంలో ఆయన బీజేపీలో చేరనున్నారు. కాగా దేవుడు పార్టీలో చేరడాన్ని టీడీపీ, బీజేపీ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఈ సందర్భంగా 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న టీడీపీ కార్పొరేటర్లు, కూటమి నాయకులతో సంప్రతించకుండా ఎంపీ రమేశ్ ఏకపక్షంగా ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు, నాయకులు, కార్యకర్తలు దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అలాగే సుజాతనగర్‌లో టీడీపీ, జనసేన నాయకులు దాట్ల మధు, ఆళ్ల తాతారావు, అయిత ఎర్నిబాబు, గల్లా రమణ మాట్లాడుతూ అధికారం కోసమే దేవుడు బీజేపీలో చేరుతున్నారని విమర్శించారు.

'శారదా పీఠం ఆక్రమణలపై సీఎంను కలుస్తా'


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రామ్

పెందుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చినముషిడివాడలో ఉన్న శారదా పీఠం భూ ఆక్రమణలపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విన్నవిస్తానని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ తెలిపారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో శారదా పీఠం గెడ్డ ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శారదా పీఠాధిపతి ఆధ్యాత్మిక ముసుగులో భూదోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పోరాటం చేస్తానని చెప్పారు. కాగా తహసీల్దార్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ శారదా పీఠం భూఆక్రమణ సున్నితమైన అంశమని, కలెక్టర్ స్థాయిలో నిర్ణయం చేయాల్సి ఉందన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టలేదని, కానీ శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా 20 సెంట్లు గెడ్డ భూమి ఉందని గుర్తించామని తెలిపారు.

సురక్షిత నగరంగా విశాఖ

- నగర సీపీ శంఖబ్రత బాగ్చీ
- ఐటీ హబ్‌లో పోలీసు అవుట్ పోస్టు ప్రారంభం


అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

సాగర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉన్న మొదటి పది సురక్షిత నగరాల్లో విశాఖను ఒకటిగా చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు.ఐటీ హబ్ కూడలిలో పీఎంపాలెం పోలీసుల ఆధ్వర్యంలో పెన్నెంట్ ఐటీ సంస్థ సౌజన్యంతో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీసు అవుట్ పోస్టును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీ పరిశ్రమల్లో పగలు, రాత్రి విధులు నిర్వహించే ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవుట్ పోస్టులో పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఐటీ హిల్స్ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ఎప్పటికప్పుడు పోలీసుల పహరా ఉంటుందన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో తీవ్రతను గుర్తించి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేరాల సంఖ్యను తగ్గించడంలో పోలీసులకు ప్రజా సహకారం అవసరమని తెలిపారు. నగర పరిధిలో నిర్మానుష్య ప్రదేశాలు విజుబుల్ వుండే విధంగా చర్యలు తీసుకుంటే గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటివి నిలువరించడానికి అవకాశం ఉంటుందన్నారు. కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతులు రావడం వల్ల ఎస్ఐల సంఖ్య తక్కువగా ఉందని చెప్పారు. అవుట్ పోస్టు ఏర్పాటుకు ఆర్థికంగా సహకరించిన పెన్నెంట్ ఐటీ సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 అజిత వేజెండ్ల, జోన్-2 జెడ్సీ సింహాచలం పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

పేద విద్యార్థులకు కేంద్రం ఆర్థిక ఆసరా

- నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ద్వారా సాయం
- తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేల చొప్పున నగదు చెల్లింపు
- గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 309 మంది ఎంపిక
- ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న వారికి డిసెంబరు 8న రాత పరీక్ష

రోలుగుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): **ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు చదువును మధ్యలో ఆపేయకుండా కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ తోడ్పాటు అందిస్తోంది. ఇందులో భాగంగా జాతీయ ప్రతిభ, ఉపకార వేతన పరీక్షలో ప్రతిభ చాటినవారికి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పేరిట తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు రూ.48 వేలు ప్రోత్సాహంగా అందుతుంది.**

కేంద్ర ప్రభుత్వం 2008లో జాతీయ ప్రతిభాన్వేషణ ఉపకార వేతన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం ఏటా నవంబరు లేదా డిసెంబరు నెలలో దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహిస్తున్నది. వచ్చే విద్యా సంవత్సరంలో ఎన్‌ఎంఎంఎస్ అమలుకు ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న వారికి డిసెంబరు 8వ తేదీన రాతపరీక్ష జరగనున్నది. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 17వ తేదీతో ముగిసింది. గత మూడేళ్లల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్‌ఎంఎంఎస్‌కు 985 మంది ఎంపికయ్యారు.


అర్హతలు, పరీక్ష విధానం

కేంద్ర ప్రభుత్వం ఏటా దేశ వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నది. ఏడు, ఎనిమిది తరగతుల్లో నమోదు అయిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆ ఏడాది ఏ రాష్ట్రానికి/కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్ని స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలో కేంద్రం నిర్ణయిస్తుంది.

- ప్రభుత్వ/జిల్లా పరిషత్/ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హులు. ప్రతి ఏటా ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాయాలి.
- ప్రైవేటు పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు, ఆశ్రమాలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులు అనర్హులు.
- విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలకు మించకూడదు. ఏడో తరగతిలో 55 శాతం.. అంతకన్నా ఎక్కువ మార్కులు పొందితేనే పరీక్ష రాయడానికి అర్హులు
- ఎనిమిదో తరగతిలో కూడా 55 శాతం పైబడి మార్కులు వస్తేనే అర్హులు
- పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 60 శాతం పైబడి మార్కులు వస్తేనే ఇంటర్/ప్లస్-1లో ఉపకారవేతనం మంజూరు అవుతుంది.
- ఇంటర్ లేదా ప్లస్2లోనూ 55 శాతం కన్నా ఎక్కువ మార్కులు రావాలి.
- మార్కుల విషయంలో అన్ని తరగతుల్లో ఎస్సీ, ఎస్టీలకు 5 శాతం తగ్గింపు వెసులుబాటు ఉంది.
- ఎంపికైన విద్యార్థికిఇ మరుసటి సంవత్సరం.. అంటే తొమ్మిది తరగతి నుంచి ఇంటర్మీడియట్/ప్లస్ 2 పూర్తయ్యే వరకు ఏటా స్కాలర్‌షిప్ అందుతుంది.
- ఇప్పటి వరకు ఏడాదిలో మూడు విడతల్లో సొమ్ము అందేది. ఇక నుంచి మొత్తం సొమ్ము ఒకేసారి మంజూరు అవుతుంది.
- తల్లిదండ్రులు, విద్యార్థి కలిపి బ్యాంకులో ఉమ్మడి ఖాతాను తెరవాలి.

పరీక్ష మూడు గంటలు.. 180 ప్రశ్నలు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం ప్రతిభ కలిగిన విద్యార్థులను ఎంపిక చేయడానికి నిర్వహించే పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో విభాగానికి 90 మార్కులు కేటాయించారు. మొత్తం 180 మార్కులతో ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. మొదటి పరీక్షలో మెంటల్ ఎబిలిటీ పరీక్ష, రెండో పేపర్‌లో 7, 8 తరగతుల పాఠ్యాంశాల ఆధారంగా వుంటుంది. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. స్కాలస్టిక్ అప్టిట్యూడ్‌లో గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాల నుంచి 90 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కొక్క పాఠ్యాంశానికి 30 మార్కుల చొప్పున ప్రశ్నలు వుంటాయి.


ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్షకు సన్నద్ధమవుతున్న కుసర్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు





కష్టపడే నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు

- 'కూటమి' పార్టీల విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇన్‌చార్జి మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయన శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి పార్టీల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధిష్ఠానం తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు విశాఖను దోచుకున్నారని మంత్రి ఆరోపించారు. వైసీపీ పాలకులకు భయపడి వెళ్లిపోయిన లులు గ్రూపు..చంద్రబాబు సీఎం కావడంతో తిరిగి విశాఖ వస్తోందన్నారు. విశాఖకు టీసీఎస్‌ను తీసుకురావడంలో మంత్రి లోకేశ్ చొరవ ప్రశంసనీయమన్నారు. గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం కష్టించి పనిచేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి గుర్తింపు ఉంటుందని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి అన్నారు.

ఉక్కును పరిరక్షించుకోవాలి: పల్లా

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వైసీపీ పాలనలో మూడేళ్లపాటు విశాఖకు దోచుకున్న దొంగ విజయసాయిరెడ్డి మరోసారి నగరానికి వచ్చారన్నారు. విజయసాయిరెడ్డి పెద్ద దోపిడీదారుడని, గతంలో ఆయన చేసిన అక్రమాలను వెలికితీస్తామన్నారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ఇన్‌చార్జి మంత్రి జిల్లాలో అధికారులతో పనిచేయించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖకు టీసీఎస్ తీసుకువచ్చామని, నగరంలో రాత్రి 12 గంటల వరకు హోటళ్లు తెరిచి ఉంచేలా అనుమతులు తీసుకువచ్చామన్నారు. సమావేశంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే చెల్లుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో అందరం కలిసి పనిచేద్దామన్నారు. ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, విశాఖ దక్షిణ, భీమిలి టీడీపీ ఇన్‌చార్జులు సీతంరాజు సుధాకర్, కోరాడ రాజబాబు, రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు మహ్మద్ నజీర్, పొలమరశెట్టి శ్రీనివాస్, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, జనసేన ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు. తొలిసారిగా పార్టీ కార్యాలయానికి వచ్చిన ఇన్‌చార్జి మంత్రిని సత్కరించారు.

ప్రసాద్ పథకం పనులు వేగవంతం చేయాలి

దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై ప్రసాద్ పథకం నిధులు రూ.59.2 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం ఆయన సింహగిరిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను ఈ ఏడాది డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాల్సి ఉండగా, ఆ దిశగా వేగం కనిపించడం లేదన్నారు. తక్షణమే దీనిపై దృష్టిసారించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పనులు దేవదాయ శాఖ మాస్టర్ ప్లాన్‌కు లోబడి జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తమ శాఖ కూడా కొన్ని పనులు చేయనుందన్నారు. వైదికుల ప్రతిపాదనల మేరకు యాగశాల, రామానుజ కూటమి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. త్వరలోనే సహస్ర దీపాలంకరణ సేవను పునఃప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ వేంద్ర త్రినాథరావు, పర్యాటక శాఖ ఈఈ రమణ, ఏఈ మదన్‌మోహన్, ఈఈలు శ్రీనివాసరాజు, బి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న దేవదాయశాఖ కమిషనర్

రేషన్ సరకులు దారి మళ్లిస్తే క్రిమినల్ కేసులు: జేసీ

మహారాణిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలను విస్తృతంగా తనిఖీ చేసి నిల్వ కేంద్రాల నుంచి సరకులు దారి మళ్లించే వారిపై 6-ఎ కేసులు నమోదుచేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను, తనిఖీ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో రేషన్ సరకుల పంపిణీ, దుకాణాల నిర్వహణ, ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. రేషన్ సరకులు దుర్వినియోగం కాకుండా చూడాలని, దారి మళ్లించే వారిపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. బినామీ పేర్లతో కొంతమంది దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రేషన్ సరకులు సమీపంలోని టోకు దుకాణాలకు తరలిపోతున్నట్టు పత్రికల్లో కథనాలు వస్తున్నందున యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ, ఎక్కడైనా తప్పు జరిగినట్టు గుర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎండీయూ వాహనాలు ఉదయం ఏడు గంటల నుంచే ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఇంటింటికీ వెళ్లి, బియ్యం, ఇతర సరకులు పక్కాగా అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ మయూర్ అశోక్

'శిక్షణ నైపుణ్యాన్ని వినియోగించుకోవాలి'

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లు శిక్షణను సమర్థంగా వినియోగించుకోవాలని డీఐజీ గోపీనాథ్ అన్నారు. జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లుగా నియమితులై 19 మందికి నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కొటిక్స్, సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్, డిపార్టుమెంట్ ఆఫ్ రెవెన్యూ అక్కయ్యపాలెంలోని జీఎస్టీ కార్యాలయంలో 14 వారాలు శిక్షణ ఇచ్చింది. శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సర్టిఫికెట్లను అందజేశారు. రవికిరణ్ ఈదర, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జట్టి

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని, ఆధునిక గ్రంథాలయ భవనాన్ని నిర్మించాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల అసోసియేషన్ శుక్రవారం ఎంపీ శ్రీభరత్‌ను కోరింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులు వినతపత్రం అందజేశారు. గ్రంథాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్య, గ్రంథాలయాల శాఖా మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు.


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నేటి నుంచి ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ మధ్య రంజీ మ్యాచ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ మధ్య నాలుగు రోజుల రంజీ ట్రోఫీ మ్యాచ్ శనివారం ప్రారంభం కానుంది. విశాఖ చేరుకున్న ఇరుజట్ల ఆటగాళ్లు శుక్రవారం ముమ్మర సాధన చేశారు. ఈ సీజన్‌లో ఈ నెల 11 నుంచి 14 వరకు నాగపూర్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో విదర్భపై 74 పరుగుల తేడాతో ఓడిన ఆంధ్ర..ఈ నెల 18 నుంచి 21 వరకు అహ్మదాబాద్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో గుజరాత్‌పై ఓటమి చవిచూసింది. సొంత పిచ్‌పై విజయం సాధించాలని దృష్టి సారించింది.


నెట్స్‌లో సాధన చేస్తున్న ఆంధ్ర క్రికెటర్లు

హనుమ విహారి వరుస వైఫల్యం

ఏసీఏ గత కార్యవర్గంతో ఏర్పడిన విభేదాల కారణంగా జట్టు నుంచి తప్పుకొన్న హనుమ విహారి...కూటమి ప్రభుత్వం ఆహ్వానం మేరకు తిరిగి జట్టులో చేరాడు. ఈ సీజన్‌లో ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. మరో సీనియర్ క్రికెటర్ శ్రీకర్... గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో (98), రెండో ఇన్నింగ్స్‌లో (47)తో రాణించాడు. తొలి రెండు మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించిన రిక్కీ భుయ్...ఆస్ట్రేలియాలో పర్యటించనున్న భారత్-ఎ జట్టుకు ఎంపిక కావడంతో యంగ్ క్రికెటర్ రషీద్ ఆంధ్ర జట్టు సారథ్య బాధ్యతలు చేపట్టాడు.





క్రైం... crime news

బాలికపై లైంగిక దాడి: ముద్దాయికి 25 ఏళ్ల జైలు

విశాఖపట్నం(లీగల్) అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసిన ముద్దాయికి 25ఏళ్ల జైలుశిక్ష, రూ. 21వేలు జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది బుధవారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బాధిత బాలికకు ప్రభుత్వం రూ.4 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బొమ్మల వ్యాపారం చేసే సాడి పోలిరెడ్డి (57) 2023 ఆగస్టు 24న మధ్యాహ్నం ఆడుకునేందుకు బాధిత బాలిక ఆడుకునేందుకు అతడి ఇంటి సమీపానికి వెళ్లింది. ముద్దాయి బాలికను పిలిచి తన సెల్‌ఫోన్‌లో అసభ్యకర బొమ్మలు చూపించి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ తరువాతి రోజు వరకు బాలిక అతడి ఇంట్లోనే ఉండిపోయింది. తల్లిదండ్రులు రాత్రంతా గాలించినా ఫలితం కనిపించలేదు. మరుసటి రోజు బాలిక ఇంటికి చేరుకుని జరిగినదంతా తల్లిదండ్రులకు చెప్పింది. వారు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేశారు. కోర్టు 18 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష

సింధియా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో 15మందికి జరిమానా, ముగ్గురికి 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ 4వ స్పెషల్ జ్యుడీషియల్ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. హార్బర్ ట్రాఫిక్ సీఐ ఎస్.షణ్ముఖరావు అందించిన వివరాల మేరకు డ్రంకెన్ డ్రైవ్‌ల్లో పట్టుబడిన 18 మందిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి 15 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ ఎస్.రవిశంకర్ పట్నాయక్ (50), లారీ డ్రైవర్ ఎం.సాహూ (22), ఆటో డ్రైవర్ పి.కాళి (35)లకు 15 రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

సింహాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ప్రియాగార్డెన్స్‌లో నివాసం ఉంటున్న లావణ్య (32) భర్త చిరుద్యోగి కావడంతో తాను ఉద్యోగం చేయాలనుకుంది. ఈ విషయాన్ని అదే వార్డుకు చెందిన ఆర్‌పీ లక్ష్మీ ప్రసన్న, కోటకోట సచివాలయంలో పనిచేస్తున్న ఎండీ జాకీర్‌కి చెప్పడంతో వారు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. ఈ మేరకు 2019 నుంచి 2022 వరకు పలు దఫాలు సుమారు రూ.14 లక్షలు వసూలుచేశారు. ద్యోగం రాకపోవడంతో డబ్బులు తిరిగివ్వాలని లావణ్య కోరగా సమాధానం లేదు. దీంతో ఈనెల 18న ఆమె సీపీ శంఖబ్రతబగ్చీ ఫిర్యాదు చేసింది. విచారణకు గోపాలపట్నం పోలీసులను ఆదేశించారు. వారం రోజులైనా స్పందన లేకపోవడం, అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఈనెల 24న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. దీనిపై సీఐ సతీశ్ మాట్లాడుతూ కేసు దర్యాప్తు జరుగుతోందని, బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు.

విశాఖ డెయిరీ భూములపై ఆర్డీవో విచారణ

భీమునిపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చినగదిలి మండల పరిధిలో విశాఖ డెయిరీకి చెందిన భూములపై భీమిలి ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం విచారణ జరిగింది. కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో సంగీత్ మాధుర్ డెయిరీ అధికారులకు నోటీసులు జారీ చేశారు. డెయిరీ ప్రతినిధులు విజయరావు, నీలయ్య, చినగదిలి తహసీల్దార్ పాల్‌కిరణ్, డిటి రాజేశ్ విచారణకు హాజరయ్యారు. డెయిరీ అధికారులు భూములకు సంబంధించిన పత్రాలను ఆర్డీవోకు అందించారు. రెవెన్యూ అధికారులు కూడా నివేదిక ఇచ్చారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమిక విచారణ జరిపామన్నారు. వచ్చే నెలలో మరోసారి విచారణ చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో భూముల పరిస్థితిని పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు.

సాలాపువానిపాలెంలో భారీ చోరీ

- లక్ష నగదుతోపాటు 7.5 తులాల బంగారం అపహరణ

లంకెలపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి లక్ష రూపాయల నగదు, ఏడున్నర తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. పరవాడ మండలం సాలాపువానిపాలెంలో శుక్రవారం జరిగిన చోరీకి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. ఎం.కోడూరు చెందిన మైచర్ల అప్పారావు కుటుంబం గురువారం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లారు. గుర్తు తెలియని దుండగలు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.లక్ష నగదు, ఏడున్నర తులాలు, బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. తిరిగి వచ్చిన అప్పారావు చోరీ జరినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మోహనరావు, సీఐ మలికార్జునరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27 వరకు గడువు పెంచినట్టు ఆశాఖ ఉప సంచాలకులు కె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు ఎస్సీ మహిళా అభ్యర్థులు, ప్రైవేటు శిక్షణ సంస్థల్లో శిక్షణకు పురుషులు, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు https://mdfc.apcfss.in, http//jnanabhumi.ap.gov.in అనే పోర్టల్‌లోకి వెళ్లాలన్నారు.

6 నుంచి రసజ్ఞ జాతీయ నాటకోత్సవం

వెంకోజీపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రసజ్ఞ 9వ జాతీయ నాటకోత్సవాలను నవంబరు 6 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఏయూలో వీసీ జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. ఈ నాటికలు ప్రతి రోజు సాయంత్రం ఐదున్నర గంటల నుంచి కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.